# మంత్రి నీడ

అప్పుడు, అక్కడ జరిగిన సంఘటనలనూ, సంగతులనూ చూసీ చూసీ, అలసిపోయి వెళ్లిపోయాడు కర్మసాక్షి.

అతనితో పాటే, ఆ సంఘటనల తాలూకు సాక్ష్యాలనూ, ఆధారాలనూ సేకరించుకుని, దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది పోలీసుజీపు.

ప్రాణం పోకడకు. ఆయుర్దాయం తీరడం మాత్రమే కాక, కులాలూ, మతాలూ రాజకీయాలూ, పదవులూ, పెనుగులాటలు, మాత్సర్యాలూ కూడా కారణాలౌతాయని అంతకుముందు ఎరుగని అరుంధతమ్మ మొహం ఏడ్చి ఏడ్చి ఎర్రబడిపోతే సానుభూతితో ఆకాశం కన్నీళ్లు కార్చడానికి సిద్ధపడ్డట్టు కారుమబ్బు కమ్మింది.

పోయినప్రాణం పోగా, ప్రాణం ఎందుకు పోయిందో ఎలా పోయిందో, తెలుసుకోడానికి శవాన్ని కోసీ, కుట్టీ, లాంఛనాలన్నీ పూర్తిచేసి ఐనవాళ్ళకి అప్పగించే సరికి అసుర సంధ్య వేళయింది. అంతిమయాత్ర కది సమయం కాదన్నాడు అనుభవజ్ఞుడైన సిద్ధాంతి. అప్పటివరకూ ఈగల్లాముసిరిన జనం ఎవరిళ్ళకు వారు తరలిపోయారు. శవం ఇంటికిచేరింది.

“ఎదవ నాయాలు - యూషికి పోతాడు - రేపీపాటికి పోలీసులు జైల్లో తోస్తారు—” మూరెడు పొడుగు చుట్ట

పొగపీల్చి, ఉమ్మేస్తూ ఆవేశంగా అన్నాడు భుజంగరావు. భుజంగరావు పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్. అప్పుడే ఆయన ఇంటికి చేరాడు.

"పాపం - పెద్దతనంలో అరుంధతమ్మకు పసుపు కుంకుమ లేకుండాపోయాయి. ఏందో - ఎవరి రాత ఎవరు చూడొచ్చారు. అంతా విధి-" అన్నది రామసీతమ్మ. ఆయన సతీమణి, కుర్చీ వెనక నిలబడి.

ఆమె అలా అన్నప్పుడు భుజంగరావుకి ఎందుకో కడుపులో దేవినట్లయింది.

"పో-పో-ఎల్లి దేవుడిగదిలో దీపమెయ్! పెంద్రాళే దీపాలెయాలని కూడా ఎరగవు. ఈపూట నేను బోం చెయ్యనుగానీ, ఆనక కాసిని పాలు పంపించు, నేను మేడ మీదికి బోతున్నా. అవసరం అనుకుంటేగానీ లేపమాకు-"

భర్త అంత హడావుడిపడ్డం ఎందుకో రామసీతమ్మకి అర్థం కాలేదు. చనిపోయిన సుబ్బరామయ్యకీ భుజంగ రావుకీ పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుందని ఆమెకి తెలుసు. అంతటి శత్రువు పోయినా, ఈయన ఇంత బాధపడుతూ వుంటే, అతగాడి దయాగుణానికి, హృదయ వైశాల్యానికి జోహారులర్పిస్తూ దేవుడి గదిలో దీపంవేసింది రామసీతమ్మ. అక్కడ గోడన వున్న వెంకటేశ్వరస్వామి, అలివేలుమంగల ఫొటో కాక సుబ్బరామయ్యా, అరుంధతమ్మలే కనిపించారు ఆమెకు.

బొట్టు లేకుండా కళావిహీనంగా వున్న అరుంధతమ్మ మొహం ఊహించుకుని ఉలిక్కిపడింది రామసీతమ్మ.

'ఒకరికి ఉపకారం చెయ్యడవేగాని మరోటి ఎరగని ఆ తల్లికి ఇంత అన్యాయం చెయ్యడానికి ఆ వెధవకి చేతు లెట్లా వొచ్చాయో!' అనుకుంటూ ఇత్తడిచెంబు తీసుకుని కొష్టంలో గేదెదగ్గరికి పోయింది రామసీతమ్మ. మాయదారి గేదె, ఎవరంటే వాళ్లు ముట్టుకుంటే పాలు యివ్వదు. అప్ప టికే గేదె ముందు ఇంత ఎండుగడ్డి పడేసి కుడితి తొట్టినిండా నీళ్లు వొంపి వెళ్లిపోతున్నాడు పోతరాజు. పాలు తియ్యడాని కొచ్చిన రామసీతమ్మను చూసి, "ఎంత పనై పోనాది అమ్మ గారూ!" అంటూ దగ్గరకువచ్చాడు.

రామసీతమ్మ మండువాలోగిలి దాటి బయట కాలు పెట్టదు. పట్నం వెళ్ళాలంటే పాలేరు బండి కట్టుకొస్తాడు. పేరంటానికీ పెళ్లిళ్లకీ వెళ్ళడానికి పనిమనిషో, బట్టలు ఉతికే చాకలో వెంటవస్తారు.

అంచేత ఆమెకి ఊళ్ళో జరిగే విశేషాలేం తెలియవు. భుజంగరావుకి బోలెడన్ని వ్యవహారాలు — ఆయన రామ సీతమ్మతో మాట్లాడినా ప్రెసిడెంటు హోదాలోనే మాట్లాడ తాడు. అందుకోసం పాలేరు పోతరాజే ఆమెకి వార్తలన్నీ చెబుతాడు. ఎక్కడేం జరిగినా మరు నిముషంలో అమ్మ గారికి ఆ వార్త వ్యాఖ్యానంతో సహా అందజేసి, అమ్మగారి ఆదరణకు పాత్రుడౌతాడు.

"ఇంతకీ ఇదంతా ఎట్టా జరిగిందంటావు పోతరాజు!"

"ఎందోలెండమ్మగారు, అవన్నీ పెద్దోళ్ల యవ్వారాలు. మొత్తా నికి సుబ్బరామయ్యగారి తరం ఎల్లిపోనాది. ఏరోజు కెట్టా గుంటదో తెలీకుండా పోనాదమ్మా. రోజులెప్పట్లాగ లెవ్వు.

గొప్పోరి పన్లు మనం మాట్లాడరాదండమ్మా." గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు వాడు.

అట్లా గొణుక్కుంటూ పెరట్లో నుయ్యిదగ్గరకు వెళ్లిన పోతరాజుకి, ఆనాడు జరిగినదంతా మళ్లీ మస్తిష్కంలో మెదలింది. తెల్లవారేసరికి ఊరు ఊరంతా కోడై కూసింది. ఊరవతల సుబ్బరామయ్యగారి అరటితోటలో ఆయన శవం ఖండ ఖండాలుగా త్రెంచబడి కనిపించిందట. ఖండాలన్నీ పోగుచేసి ఒకచోట చేర్చి యజమానిని పోల్చారు పాలేర్లు. పదిమందీ పోగయ్యారు, అందరినోటా వినిపించింది ఒకే ఒక్క పేరు. అది మస్తాన్‌ది – దానికి తగ్గట్లు వాడు ఇంట్లోలేడు. ఎక్కడికి పోయాడంటే వాడి పెళ్ళాం తడబిడపడిపోయింది. కళ్లంట నీరెట్టింది. గడగడ వణికింది – దానింట్లో ట్రంకు పెట్టెలో మూడువందల రూపాయలు దొరికాయి. పోలీసులు మస్తాన్ పెళ్ళాం రాజమ్మని ఎన్నో ప్రశ్నలువేశారు. వాళ్ళ ముందది కడుపు తరుక్కుపోయేలాగ ఏడ్చింది. దాని ఏడుపు చూస్తే పోతరాజుకి ఏనాడో చచ్చిపోయిన తన పెద్దకూతురు జ్ఞాపకంవచ్చింది. అనుభవం ఒకడిదీ, ఆయాసం మరొకడిదీనూ! ఏమిటో కలికాలం కదా మరి యిది! "మస్తాన్‌గాణ్ణి ఆళ్ళు ఎటూ పట్టుకుంటారు. పాపం – రాజమ్మ వొట్టి అమాయకం పిల్ల – దాని బతుకేటౌతుందో ఏమో!" అనుకున్నాడు పోతరాజు – సరిగ్గా అదే సమయానికి –

"సత్తెపమాణంగా నానేటి ఎరుగను చిన్నమ్మా – మూడురోజులాయె–ఆడు నా కంటికక్కనబడి. ఇంత కిరాతకం ఆడు చేశాడంటే నే నమ్మలేకున్నాను చిన్నమ్మా," అంటూ

సీతమ్మని కావలించుకుని బోరుమని ఏడుస్తోంది రాజమ్మ. దాని నాలుగేళ్ళ కొడుకు చిట్టిబాబు దిగాలుపడిపోయి గోడ కానుకుని నిలబడ్డాడు. "ఊరుకోయే రాజమ్మ నువ్వోట్టి ఎర్రి మొఖానివి. ఆడు నిజంగా సేసే వుంటాడీపని. ఆళ్ళింటో ఆరేళ్ళసందీ పనిసేత్తూ ఎంత నమ్మకంగా వుండీ వుండీ ఎట్టా సేశాడో సూస్తివా?" బుగ్గలు నొక్కుకుంది మాణిక్యం.

"ఇది మస్తాన్‌గాడి పనేనని ఊరంతా ఏకమై చెప్తా వుంది. సరిసరి. ఐపోయిందాని కింక సేసేదేంవుందంట. మీరంతా వెళ్ళి పన్లుచేసుకోండి. వొసేయ్ రాజమ్మా! ఎందుకంత బేలవైపోతావు. ఈ పూటకు నేను అన్నం వండిస్తా తీసుకుపో! పస్తులుండి ఏంచేస్తావే పాడుదానా!" అంటూ రాజమ్మను సముదాయించి, అమ్మలక్కల్ని తరి మేసింది సీతమ్మ.

ఎరువు బాగా వేసి పెంచిన మొక్కకి మొట్ట మొదట పండిన టొమాటో పండులా జవజవలాడుతూ వుండే సీతమ్మ ఇంట్లో పనిచేసి, నెలకి పదో, పరకో పట్టుకుపోతుంది రాజమ్మ. ఊరిజనం సూటీ పోటీలు వినలేక ప్రొద్దుటినుంచీ అమ్మగా రింట్లో తల దాచుకుంది. ఆమె సముదాయించేసరికి దాని దుఃఖం వాగులై వరదలైపోయింది.

ప్రొద్దుటినుంచీ మంచినీళ్ళైనా ముట్టని రాజమ్మ వర్షాలు లేక బీటలువారిన భూమిలో మొలిచిన మొక్కలాగ ఎండి పోయి వుంది. దాని కళ్లు వర్షాభావానికి ఆవిరైపోయిన బావుల్లాగ ఆరిపోయి గుంటలు పడిపోయాయి. "కేస్టు బుజ్జా

అయితే ఆణ్ణి ఉరితీస్తారా చిన్నమ్మా?" అంటూ మళ్ళీ బావురుమంది రాజమ్మ.

"నువ్వూరుకోయే పిచ్చి ముండా! ఉరేలతీస్తారు గానీ - జైలు శిక్షౌతుంది—ఆడు లేందే బతకలేవా ఏందే! ఎప్పుడు సుఖపడి చచ్చావే ఆడితో! ఇంకా ఆడిమీద భ్రాంతి పోలేదా నీకు?" కసిరింది సీతమ్మ. కసిరినా ఆ గొంతులో కనపడిన ఆదరణకి ఊరటపడింది రాజమ్మ.

"మతం కానోడితో ఎప్పుడైతే లేసొచ్చావో అప్పుడే నీ బతుకు బండలైందే ఎర్రిదానా! ఆడు ఎసుమంటివాడు, ఆడితో నా బతుకెలాగుంటది అని ఆలోచించుకుని పెళ్ళాడి నావా అంట! జరిగిందెలాగ జరిగిపోయింది. దుఃఖపడమాక" సీతమ్మ చీర కుచ్చెళ్ళు దులుపుకుంటూ లేచి నిలబడింది. నీళ్లు నింపిన రబ్బరు బంతిలాగ వున్న సీతమ్మ, గాలిపోయిన రబ్బరు బుడగలావున్న రాజమ్మ భుజంతట్టి, "ఇంట్లో యేడపని ఆడనే వుండిపోయింది. కాస్త రేపోమాలి వచ్చి కలియబెట్టి పోవే పిచ్చిముండా - నువ్వు రాకపోతే సచ్చిపోతాను. ఇంద, ఈ ఐదు రూపాయలుంచు నీకాడ" అంటూ తన రొండిలోనుంచి ఐదురూపాయలకాగితంతీసి ఇవ్వబోయింది. "వొద్దు చిన్నమ్మా - నాకాడ మూడొందల రూపాయలున్నయ్ - ఎప్పుడు తెచ్చి పడేసినాడో ఏటో, సూసుకోనైనా లేదు. అవసరమైనప్పుడు నీకాడ తీసుకోకపోతానా?

"పొద్దుపోయింది, మరి వస్తాను" రాజమ్మ ఉసూరుమంటూ బయటికి కదలిపోయింది.

సీతమ్మది కొంచెం ఊరికి దూరంగా వుండే డాబా ఇల్లు. పొలం దగ్గరగా కట్టించుకున్న కొత్త ఇల్లు.

సీతమ్మ భర్త రామస్వామి ముప్ఫైఎకరాల మాగాణి కలవాడు. ఒక మగపిల్లవాడూ, ఒక ఆడపిల్లా పుట్టాక నాలు గేళ్ళైనా వాళ్ళని కన్నుల పండుగగా చూసుకోకుండానే ఒకనాటి రాత్రి హృద్రోగంతో మరణించాడు. అతగాడి హఠాన్మరణాన్ని గురించి జనం రకరకాలుగా చెప్పుకుంటారు. అతడిది మిన్ను విరిగి మీదపడ్డా ఆగిపోని ఇనప గుండె అనీ - అతగాడు ఆజాను బాహుడూ, అజాత శత్రువూ అని కూడా చెప్పుకుంటారు. అయితే ఇంత మహా బలశాలీ, ఆరోగ్య వంతుడూ అయిన రామస్వామి రాత్రి తొమ్మిది గంటల వరకూ చెన్నకేశవస్వామి కోవెలలో కూర్చుని, పంచాయతీ రేడియో వింటూ, ప్రక్కవాళ్ళతో హుషారుగా కబుర్లు చెప్పినాడు. తెల్లవారేసరికి, అసువులు బాసి, వీధి వాకిట్లో గడ్డిమీద పడివున్నాడంటే నమ్మలేనివాళ్లే ఎక్కువమంది. అప్పటికి సీతమ్మ కొడుక్కి మూడేళ్ళు. కూతురికి ఏడాది. సీతమ్మ ఛాయ గజనిమ్మపండు ఛాయ. రామస్వామికన్న రెండంగుళాలు పొట్టిగా వున్న మంచి శరీర సౌష్ఠవం కలిగి, వెంకటగిరి జరీచీరె కట్టి, రెండు చేతులకూ రెండు డజన్ల బంగారు గాజులు ధరించి, కళ్ళ కొనలకు కాటుక రేఖలు దిద్ది, పాపిట మొదట్లో రంగు కుంకుమ అద్ది, ఆమె కాలు వీధిలో పెడ్తే మెడతిప్పి చూడనివాడూ, "రామస్వామి పెళ్ళాం సినిమాస్టార్ లాగుంటది సుమా!" అననివాడూ లేడు.

అయితే రామస్వామి మాత్రం కార్తీకమాసంఅంటూ

మాఘమాసం అంటూ కాలువలో స్నానాలుచేస్తూ, శివుడికి అభిషేకాలూ, విష్ణుమూర్తికి సహస్రనామాలూ చేస్తూ ఎప్పుడూ గుడి గోపురాల దగ్గరా, పురాణ కాలక్షేపాల దగ్గిరా, పొలంలోనూ, తోటల్లోనూ వుండే వాడే కానీ, ఇంట్లో తక్కువ కనబడేవాడు.

రామస్వామిది ఆత్మహత్య అని కొందరు, హత్య అని కొందరూ గుసగుసలాడుకుంటూ వుండగానే, ఒక చెంప భర్త పోయినందుకు గుండెబాదుకుని ఏడుస్తూనే, వేరొకవైపున శవాన్ని త్వరగా సాగనంపడానికి ప్రయత్నాలు చేయించి పదిగంటలు కాకముందే అతని కట్టెని కట్టెల్లో పెట్టించేసింది సీతమ్మ.

భర్త పోయిన్నాటినుంచీ సీతమ్మ ఏ బంధువులింటికీ వెళ్ళలేదు. ఏ బంధువునీ తనింటికి చేరనివ్వలేదు. భుజంగం బావగారి సాయంతోనే పిల్లల్ని పెంచి, పొలం పుట్రాచూసుకుంటూ పొలం దగ్గరే ఓ డాబా ఇల్లు కట్టించుకుని (కృష్ణా, రామా అంటూ) కాలక్షేపం చేస్తూవుంది. ఇప్పుడు కూతుర్ని గుంటూరు కాలేజీలో డాక్టరు చదివిస్తోంది. కొడుకు పెద్దింజినీరు చదివి భిలాయ్ వెళ్ళిపోయాడు. వాడెందుకో అసలు ఇంటికి రాడు.

కూతురిమీదే ప్రాణాలు పెట్టుకుని బ్రతుకుతోంది సీతమ్మ. ఆ ప్రాణాలు కూతురిమీదకావు, బొడ్లో దోపుకున్న తాళం చెవులగుత్తిమీదో, మరి దేనిమీదోనని గిట్టని వాళ్ళంటారు. కిట్టనివాళ్లు ఎన్నైనా అంటారు. అవన్నీ విని పించుకునే అలవాటు సీతమ్మకి లేదు.

డబ్బు కొరతలేకపోవడం అనే మహావరం పొందిన సీతమ్మకి ఏ ఇతర కష్టం వచ్చినా తీర్చడానికి భుజంగం బావగారు వుండనే వున్నారు. రాజమ్మని సాగనంపాక, తలు నిండుగా ముసుగు కప్పుకుని, గబగబ అడుగులు వేసుకుంటూ ప్రెసిడెంటుగారి లోగిలిలో ప్రవేసించింది సీతమ్మ.

అక్కడ వసారాలో స్తంభానికి ఆనుకుని చుట్ట కాల్చుకుంటున్న పోతరాజు ఆమెని చూసి చూడనట్లు కను కొసలనుంచి చూసి తుపుక్కున వుమ్మేస్తూ, "సీతమ్మగారా! దండాలమ్మగోరో!" అని వినయంగా లేచి నిలబడ్డాడు.

"అయ్యగారున్నారా లోపల?" వాడివైపు నిర్ల క్ష్యంతో కూడిన చూపొకటి విసిరి, హాలులోకి వెళ్ళి పోయింది సీతమ్మ.

హాలులో నవారు మంచంమీద పడుకుని ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు గానం చేస్తోంది రామసీతమ్మ. కూనిరాగాలువిని ఒక్కక్షణం నొసలు చిట్లించి, అక్కయ్యా- నిద్రపోతున్నావా - ఏంది?" అన్నది గట్టిగా.

"ఎవరూ! సీతమ్మవా! రా! రా! కూర్చో. ఏం టిలాగ చీకటిపడ్డాక వచ్చావు. బావగారితో ఓమైనాపనా!" అని లేచి కూర్చుంది రామసీతమ్మ.

'లేకపోతే నీతో నాకేంపని' అనుకుని "అవునక్కా —ప్రొద్దున్నే బిలాయ్‌నుంచి కృష్ణుడు ఉత్తరం రాశాడు. గుంటూర్లో పిల్లకి అర్జంటుగా డబ్బు కావాలంట. వడ్లకి ధర పలుకుతోం దంటున్నారుగా. ఓ పది బస్తాలు అమ్మేయాలి.

బావగారితో మాట్లాడి బేరం కుదుర్చుకోవాలిగా, ప్రొద్దు టేలనుంచీ మనసేం బాగులేక రాకపోతిని, ఏందో, సూశావా సుబ్బరామయ్యసంగతి!" రామసీతమ్మ ప్రక్కని కూలబడి నిట్టూర్చింది సీతమ్మ.

"అవునమ్మా, నాకూ ప్రొద్దుట్నుంచీ ఒకటే మనేదిగా వుంది. పాపం ఆ ఇల్లాల్ని సూసొత్తానంటే ఇప్పుడు గాదంటారు మీ బావగారు. అందుకే కునుకురాకపోతా వుంటే రామాయణం పాడుకుంటున్నా, ఇంతకీ సంపేసినాడు మస్తాన్ గాడే నంటావా ?" రామసీతమ్మకళ్లు పెద్దవి. నుదురూ పెద్దదే. ఆమెపెద్దనుదుటిమీద అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడిలా పెద్ద కుంకుమబొట్టు. మొహంనిండా పరుచుకున్న అమాయకత్వం ఆమెని చూస్తే అసూయకలిగిన ఆమె అమాయకత్వానికి జాలిపడుతూ.

"అయ్యన్నీ మనకెందుకులే అక్కయ్యా? బావగారేం చేస్తున్నారు ? ఒకసారి ఇక్కడికి పిలుద్దూ. మాటాడాలి అన్నది గడుసుగా.

"ఇవాళ భోజనం వద్దంట – అవసరం అయితేగాని లేపొద్దని పైకెళ్లారు – పాలుకూడా తాగలేదు– నేనుమాత్రం కడుపులో మంటకి ఆగలేక ఇంత మజ్జిగ త్రాగి పడున్నాను."

"అయితే కాళ్ళీడ్చుకుంటూ ఇంతదూరం రావడం దండగైందన్నమాట – పోనీలే– రేపొస్తాను – నా దగ్గర పైకంలేదు. వడ్లమ్మేలోగా బావగారేమన్నా సర్దుతారేమో రేపు వెంకయ్యకిచ్చి గుంటూరు పంపుదాం అనుకున్నా. అమ్మాయేం అవస్థ పడతా వుందో ఏమోననీ, మరే, అను

కున్న పన్లన్నీ కావుగా వస్తా - నేనూ ఇంటికెళ్ళి మజ్జిగో మంచినీళ్లో ్రతాగి పడుండాలిగా !” అని లేవబోయింది.

“అదేందమ్మా సీతమ్మా-ఆ మజ్జిగ మాఇంట్లోనే ్రతాగ-నువ్వొచ్చావంటే ఆయనేమంటారూ- పైకే వెళ్ళి మాట్లాడు పాపం — మొగదిక్కులేని వొంటరిదానివి. నీకు సాయం చేయడంకన్న ఏం కావాలి మాకు? నేనెట్లాగో పైకెక్క లేనుగానీ - ఈ పాలగ్లాసుకూడా తీసుకుపోయి ఆయాన కియ్యమ్మా.”

రామసీతమ్మ చేతిలోని గ్లాసులో వున్న పాలతో ఆమె మనసును పోల్చుకుంటూ, ఆ గ్లాసు అందుకుంది సీతమ్మ. ఆ గ్లాసు తన చేతిలోకి వచ్చినప్పుడు, తన మనసుతో పోల్చుకుంటేనో ?

ఒక్క క్షణం గతుక్కుమన్నా, కళ్ళనిండా విజయ గర్వం నింపుకుని పాలగ్లాసు చేత్తో పట్టుకునీ పంచాయతీ బోర్డు ్రపెసిడెంటయిన భుజంగం బావగారి మేడ మెట్లు ఒకొక్కటీ ఎక్కసాగింది సీతమ్మ.

## 2

శ్రీసీతమ్మగారి డాబాయింటి మెట్లు ఒకటి ఒకటిగా దిగుతూ దిగులుగా అనుకుంది రాజమ్మ. రోజూ సాయం ్రతానికి తాను అమ్మగారింట్లో పనిచేసి కూరో, కాయో, పువ్వో, పండో తీసుకుని ఇంటికిచేరేసరికి గుడిసె అరుగుమీద కూర్చుని ఠీవిగా సిగరెట్టు ్రతాగుతూ వుండేవాడు మస్తాన్.

మూడు రోజులాయె. వాడు తన కంటికి కనపడి. వాడి - క్రోధోద్రిక్తమైన స్వభావం తనకి తెలియంది కాదు. వాడి ఆవేశం తను అనుభవించనిదికాదు.

కానీ అంతతొందరపాటు మనిషిలోకూడా ఏమూలో మంచితనమూ, ప్రేమా దాగియున్నాయని ఇన్నాళ్ళూ నమ్మింది రాజమ్మ. ఆ నమ్మకంతోనే. ఆ రేళ్ళూ వాడితో కలసి జీవనం చేయగలిగింది. ఆ జీవనయానంలో ఆమె పొందినవి చాలావరకూ కష్టాలే అయినా, అన్ని కష్టాలనూ, వాడు ఒక్కసారి తనను దగ్గరకు తీసుకుని, "నీ అందం ముందు అందరు సినీమాష్టార్లూ తీసికట్టే రాజమ్మా" అంటే చాలు. మరచిపోయేది. ఇంక ఆ కష్టాలూ లేవు - ఆ ఊరటాలేదు.

"ఏమిటింక జరగబోయేది?" అని తలుచుకుంటే ఆమెకి కాళ్ళల్లో శక్తి సన్నగిల్లింది. ఒక్క అడుగు ముందుకు వేయ లేకపోయింది.

చిట్టిగాడు ఏం కావాలి? వాడి భవిష్యత్తు ఏం కావాలి? పచ్చని పసిమి ఛాయతో, నొక్కుల జుత్తుతో, తండ్రి పోలికలు పుణికిపుచ్చుకున్న ఈ పసివాడు, ఒక హంత కుడి కొడుకని అందరిచేతా ఈసడింపపడుతూవుంటే, తను భరించగలదా?

కాళ్ళీడ్చుకుంటూ గుడిసెకి వచ్చి తలుపు తీసిన రాజ మ్మకి మళ్ళీ దుఃఖంవచ్చింది.

మస్తాన్ని పోలీసులు పట్టుకుంటారు. వాడి కెవరూ బెయిలు యివ్వారు, ఏముందని ఇస్తారు? ఎవరి హామీపైన ఇస్తారు. ధంఢాంమీద వ్రేలాడుతూన్న గళ్ళ లుంగీలకేసి

చూసింది. గూట్లో వాసననూనె, అద్దం, దువ్వెన, సబ్బుబిళ్ళ కేసి చూసింది. కొంకెకి తగిలించిన టెర్లిన్ చొక్కా కేసి చూసింది. అలాగే చిరిగిపోయిన తన చీరెకేసీ, తను వాడుకునే దువ్వెన ముక్క కేసీ కూడా చూసుకుంది.

ఒకే ఇంట్లో వుంటూన్నా తామిద్దరి స్థాయీ వేరు. వాడికి తలకు రాసుకోడానికి వాసననూనె కావాలి. వొళ్ళు రుద్దుకోడానికి మంచిగంధపు సబ్బు కావాలి - చొక్కాలు రెండే అయినా అవి టెర్లిన్‌వే కావాలి. తనకీ! కడుపునిండా తిండీ, సిగ్గు కాపాడుకోడానికి బట్టా దొరికితేచాలు - మస్తాన్ ఈనాటివరకూ తన దర్జా నిలబెట్టుకుంటూనే వచ్చాడు.

సుబ్బరామయ్యగారింట్లో పనిచేసి తెచ్చుకున్న జీతమే కాక, తను సీతమ్మగారిని అడిగి తెచ్చిన డబ్బుకూడా వాడే వాడుకునేవాడు. కనీసం తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డకు కూడా వాడేమీ యిచ్చేవాడుకాదు. బస్తీలో వచ్చిన ప్రతి సినిమాకి వెళ్లేవాడు. అప్పుడైనా చిట్టిబాబుకోసం ఓ చాకలెట్టో, బొమ్మో, బెలూనో పట్టుకొచ్చేవాడు కాదు. ఎప్పుడైనా, "వొరేయ్ చిట్టీ, నువ్వు నా బేటావురా!" అని ఎత్తుకుని ముద్దాడేవాడు. అప్పుడు రాజమ్మ సంతోషం వొడ్డు లొరుసుకు ప్రవహించే నదీ ప్రవాహంలా వుండేది.

గోడకి చారబడి చేతుల్లో తల పెట్టుకుని కూర్చుండిపోయింది రాజమ్మ.

నోట్లో వేలు వేసుకుని తల్లి ప్రక్క కూలబడి నిద్రకి పడ్డాడు చిట్టిబాబు. ఉలిక్కిపడి, వాణ్ణి లేపి మజ్జిగన్నం తినిపించింది, నేలమీద చాప పరచి పాత గొంగళీవేసి దానిమీద

చీరవేసి వాణ్ణి పడుకోబెట్టింది. తనూ వాడి ప్రక్కనే పడుకుంది.

పడుకుందే గానీ రాజమ్మ కంటికి కునుకురాలేదు. ఆరేళ్లుగా వాళ్ళింట్లో పనిచేస్తూ, వాళ్ళ పుష్పతిని బ్రతుకు తున్నాడే! ఆ బాబుని చంపాలనే బుద్ధి వీడి కెందుకుపుట్టాలి? ఏమో ఈ పని మస్తాన్ చేశాడంటే తను నమ్మదు. ప్రతి సంక్రాంతి పండక్కీ మస్తాన్ కి బట్టలూ, తనకి కొత్తచీర పెట్టే వాళ్ళు వాళ్లు కాసినో కూసినో గింజలు కొలిచే వాళ్లు. పచ్చళ్లూ, అవీ పెట్టేవాళ్లు అట్టాంటి మంచివాళ్ళని ఇలా చేశాడు మస్తాన్. రాజమ్మ బుర్రకి ఏమీ అర్థంకావడంలేదు. ఎంత ఆలోచించినా రాజమ్మ ఆ మాట నమ్మలేకపోయింది. ఈ ప్రపంచాన్ని అర్థంచేసుకోడానికి, ఇక్కడ జరుగుతూన్న సంఘటనలు జీర్ణం చేసుకోడానికి తన ఆలోచనాశక్తి, తెలివితేటలూ ఏమాత్రం చాలవని రాజమ్మకి తెలీదు. రాజమ్మకి మొదటినుంచీ పరమహంసలా నీళ్ళనుంచి పాలను వేరుచేయడమే తెలుసుగాని, పాలనుంచి నీళ్ళను వేరుచేయడ్మ నేర్చుకోలేదు. అందుకే ఆమె బుద్ధి కుశలతకి సుబ్బరామయ్యం హత్యకీ, మస్తాన్ కి గల సంబంధం ఎలాంటిదై ఉంటుందనే సంగతి అందలేదు.

భళ్లుని తెల్లవారింది—
ప్రొద్దు కూకింది.
మళ్లీ తెల్లవారింది –

"ఇదిగోనేవ్ రాజమ్మా! మస్తాన్ గాడు బెజవాడలో రైలెక్కి మద్రాసు బయలుదేరుతుంటే పోలీసులు పట్టుకుని

అరెస్టు చేశారంట! పేపర్లో ఏసినారు. చూశావా? పైగా వాడు ఒక్కమాట మాట్లాడలేదంట. చంపింది నేను కాదని కూడా అనలేదట - ఇయ్యాళ పేపర్లో పడిందట---" నిద్ర లేవంగానే వార్త అందించింది మాణిక్యం.

"ఓరి నాయనోయ్ - ఓయ్ దేవుడోయ్" అని గుండె బాదుకుంటూ సీతమ్మగారింటికి పరిగెత్తింది రాజమ్మ- సీతమ్మ అప్పుడే నిద్రలేచి, వాలు కుర్చీలో కూర్చుని కాఫీ సేవిస్తూ పేపరు చదువుతోంది. ఆవిడ వెనకాలే వెంకట నారాయణ చేతులుకట్టుకుని నిలబడ్డాడు - ఆ మరుగుజ్జువెధవ అమ్మగారికి నమ్మినబంటు.

"అమ్మగారో? ఏంటి జరిగిందో నాకు చెప్పు తల్లీ-" అంటూ రాజమ్మ వచ్చి ఆవిడ కాళ్ళదగ్గర చతికిల బడింది.

"ఓసి నీ దుంపతెగ! నువ్వాటే! మస్తాన్ గాణ్ణి పోలీసులు పట్టుకున్నారంట, ఇదిగో ఇప్పుడే చదువుతున్నా. గుంటూరు పోలీసు స్టేషన్లో పెడతారు. ఎళ్ళిసూడనిస్తారేమో ఎడతా వేమిటే!' అన్నది.

"అమ్మగారూ! సిన్నమ్మగారూ, మీకు పుణ్యముంటది. నన్ను కాస్త పంపండి తల్లీ"మళ్ళీ ఏడుపు లంకించుకుంది రాజమ్మ.

"ఇదిగో - అట్లా ఏడిచావంటే నాకు చిరాకేస్తది, ప్రొద్దున్నే ఎదవ ఏడుపూ నువ్వూనూ! ఏడిచేం చేస్తావే ఎర్రిముండా! ఇయ్యాళ వెంకటనారాయణ గుంటూరు పోతున్నాడు పాపకోసం. ఆడితో ఎళ్లు, పోలీసు స్టేషనుకి తీసుకుపోతాడు. ఇన్స్పెక్టర్ గారు ఎరిగిన వోరేలే - రామా

పురం సీతమ్మగారు పంపార న్నెప్పు, మాట్లాడుకోనిస్తారు. ఒరేయ్ నారాయణ, మన తోటలో కాసిన క్యాబేజీపూలు కాసిని ఇన్స్పెక్టరుగారింట్లో ఇచ్చేసిరా. సాలోజులాయె పాపం ఆర్ని చూసి" అని గబ గబ అనేసి జుత్తుముడి వేసు కుంటూ లేచి నిలబడింది. "పోయి పని చూసుకోవే పాడు ముండా! మూడ్రోజులనుంచి ఒక్క పనీ తిన్నగా చెయ్యి వైతివి. ఎల్లి వంటిల్లు బాగుచెయ్యి – ఆనక నారాయణతో పాటు ఎడుదువులే" అభయహస్తం యిస్తున్న మహారాణీలా ఠీవిగా లోపలికి కెళ్ళిపోయింది సీతమ్మ. అమ్మగారికేం!

అష్టకష్టాలూ పడి మొగుణ్ణి చూసిన రాజమ్మ చెవిలో ఒకే ఒక మాట చెప్పాడు మస్తాను– అది విని వులిక్కిపడింది రాజమ్మ. నిలువెల్లా వొణికిపోయింది – ఆపైన కంటికి కడి వెడుగా ఏడ్చింది–తల బాదుకుంది. "నేనేటి సెయ్యాను," అని.

"ఇంక వెళ్ళవమ్మా – ఏమిటి నీ విధవగోల – చేత నైతే ఎవరైనా బెయిలిస్తారేమో చూడు – ఇక్కడికొచ్చి ఏడిస్తే ఏమౌతుంది?" అని కసిరి బయటికి పంపించేశాడు ఒక కానిస్టేబులు.

రాజమ్మ రామాపురం వచ్చేసరికి, తనకి మస్తాను చెప్పిన సంగతి ఊళ్లో చాలామందికి తెలియనే తెలిసింది. వాళ్ళంతా తెలివిగలవాళ్లు. తనలాంటి మొద్దులుకారు.

"ఎల్లి భుజంగం బాబుగార్ని అడుగుతాను – నా కాపురం ఎందుకిలాగ కూల్చినావని" అని గుప్పిడు బిగించి ముక్కుపుటా లెగరేసిన రాజమ్మని చూసి, అజ్ఞానినిచూసి జాలిపడుతూ నవ్వే తత్వవేత్తలాగా నవ్వింది సీతమ్మ.

"నేను నిన్ను తినమని ఇంతగడ్డి నీముందరేస్తా తింటా వుటే వైరి ముండా! తింటే అది నీ తప్పు - ఆయన చంప మన్నాడో లేదో - చంపడం వీడి తప్పు కాదా! భుజంగంబావ గారికే మొస్తుందే ఆ సుబ్బరామయ్య చస్తేనూ! ఇలాంటి మాటలు నమ్మి ఊళ్లోవాళ్లకి యిరోధం కామాక - ఆడొచ్చే దాకా నా ఇంట్లోనే పడివుండు - అంతేగానీ ఊరికే ఆగం అల్లరీ సేసి రచ్చకెక్కమాక!" అని చివాట్లేసింది సీతమ్మ-

అయినా రాజమ్మకి ఆశ చావలేదు.

మసక చీకటి పడంగానే భుజంగంబాబుగారింటికి విళ్ళి ఆయనకు దండంపెట్టి నిలబడింది. ఆయన అప్పుడే సుబ్బరా మయ్యగారింటికి వెళ్ళి, కొడుకులనూ, కూతుళ్ళనూ పరా మర్శచేసి వచ్చాడు. ఆయన వెంట భార్య రామసీతమ్మకూడా వెళ్ళింది.

"సుబ్బరామయ్య బావసంగతి నాకు తెలీందేంవుంది చెల్లమ్మా - ఈ ఏసుస్తాన్‌గాడు తన జల్సాలకి ఏ వందో రెండు వందలో అడిగుంటాడు, ఆయన లేదని వుంటాడు. ఎదవలంజాకొడుకు - తెగ తాగి ఆయన్ని చంపేసుంటాడు - సూసినవాళ్ళంతా చెబుతున్నారుగా! కత్తి దొరికిందిగా- దాని మీద వేలిముద్రలుకూడా ఆడివేనంట! ఒంటరిగా తెల్లవారు ఝామున ఎందుకు పొలం పోనిచ్చావమ్మా! రోజులన్నీ మన యేనా అంట!" అని అరుంధతమ్మను ఊరడించి వచ్చాడు.

"ఏమిటో బాబూ రామచంద్రం - మీ నాన్నగారు పెద్దవారైనారు. ఆయన్ని ఎందుకు అరటితోటకు పోనిచ్చారు

నాయనా. ఇంతకీ ఆయువు తీరిపోయిందనుకో ! ఇక ఇంటి భారం అంతా నీదే, జాగ్రత్తగా చేసుకో బాబూ ! అనవసరంగా ఎవురిజోలికీ పోమాక !" అని కొడుకులకి హితవు చెప్పి వచ్చాడు.

"ఏడవకమ్మా వరలక్ష్మీ, నిన్ను చూస్తే నా కడుపు తరుక్కుపోతావుంది. సుబ్బరామయ్య బావ బ్రతికివుంటే ఆయనతో సంబంధం కలుపుకుని నిన్ను పెద్దవాడికి చేసుకుందా మనుకున్నానమ్మా. ఏదీ ? నీలాంటి లక్ష్మీదేవి నా ఇంట్లో అడుగుపెట్టే అదృష్టం నాకుండొద్దూ - నీ పెళ్లి నా చేసేదు కాదు బావ !" అంటూ కూతురికి సానుభూతి చూపించి వచ్చాడు.

అప్పటికే ఆయనకు అలసటా, ఆయాసం వచ్చాయి. వరండాలో వాలుకుర్చీలో పడుకుని, చుట్ట ముట్టించుకుని పొగ వదులుతూ ఆలోచిస్తున్నప్పుడు వొదిగి వొదిగి నిలబడి "దండాలు బాబుగారూ !" అన్నది రాజమ్మ.

"ఎవురదీ - రాజమ్మా ఏందిట్లా వచ్చావు ! ఏం కావాలి నీకు ? అన్నాడు అక్కడే నిలబడి పలుపుతాడు పేనుతున్న పోతరాజు.

"అయ్యగారితో మాట్లాడాలనొచ్చాను బాబాయ్" అన్నది రాజమ్మ.

పోతరాజుకి ఆశ్చర్యం వేసింది.

పని చేసుకుని రోజులు వెళ్ళమార్చుకునే రాజమ్మ బాబుగారితో మాట్లాడడానికి రావడమా ? ఎంత ధైర్యం !

వాడికెందుకో అక్కడ తానుండడం మంచిది కాదనిపించి పేనుతూన్న తాడు తీసుకుని పెరటివైపు వెళ్ళిపోయాడు.

పావుగంట నిలబడ్డా భుజంగం బాబుగారు పలకలేదు, ఉలకలేదు.

మళ్ళీ ధైర్యం కూడదీసుని, "బాబుగారూ –" అని పిలిచింది.

బాబుగారు తనకి తెలీని వారేంకారు. అమ్మగారింటి కొచ్చి గంటో ఘడియో గడిపిపోతూనే వుంటారు. వారొచ్చి నప్పుడు ఇంట్లోకి ఎవర్నీ రానీయకుండా కాపలా కాసేదీ తానే గదా ! కాఫీలూ, టిఫిన్లూ అందించటమూ తానేకదా! ఎన్నో సార్లు బాబుగారు తనకిపావలాయో అర్ధరూపాయో ఇచ్చారు. బాబుగారి స్నేహితులు, పెద్ద ఆఫీసర్లూ వచ్చినప్పుడు రామ సీతమ్మగారికి మర్యాదలు తెలీవనీ, తన ఇల్లు పాతకాలపుదనీ వారికి సీతమ్మగారింట్లోనే బస చేయించి భోజన సత్కారాలు ఏర్పాటుచేసేవారు భుజంగంగారు. అప్పుడు రెక్కలుముక్కలు చేసుకుని చాకిరీలు చేసేది తాను కదూ ! మసాలాలు నూరడం, కూరలు తరగడం అన్నీ తన పన్లే కదా ! ఏంటో పెద్దోళ్ళ యవ్వారాలు మన కంతుబట్టవు," అనుకుంటుంది రాజమ్మ.

"ఎవరదీ !" అని గద్దించాడు భుజంగరావుగారు.

"నేను రాజమ్మని బాబూ !"

"ఏమే ఇలాగొచ్చావు. సీతమ్మగారేమన్నా కబురు పంపారా !" గొంతు తగ్గించి అడిగారు.

"కాదు బాబుగారూ ! నా పనిమీదే వొచ్చినాను,"
తల వంచుకుని నిలబడింది.

"నీ కేదైనా పనుంటే లోపలికెళ్ళి అమ్మగార్నడుగు"
విసుక్కున్నారు బాబుగారు.

"మీతో పని బాబూ గొణిగింది రాజమ్మ.

"చెప్పవే."

అరివీరభయంకరంగా కనబడుతున్న ఆజానుబాహుడు. వాత పెట్టడానికి సిద్ధంచేసిన ఎర్రటి కొలిమిల్లాంటి కళ్లు - గడ గడ వణికిపోయింది రాజమ్మ.

నోట మాట రాలేదు.

తల వంచుకుని "మస్తాన్‌ని చూసొచ్చినానండి. మీకాడ కెల్లమన్నాడు" అన్నది.

ఉలిక్కిపడి, సర్దుకుంటూ "అంటాడు - ఎదవసన్నాసి అనడూ మరి - తెగతాగి తూలుతూ అట్టాంటి మాటలుకాక మరేమంటాడు - అయ్యన్నీ నమ్మి నాకాడి కొచ్చినావు - బాబుగారెలాంటివారో ననే ఆలోచని నీ కెక్కడిది ! మొగుడు తాగుబోతైనాసరే, ఎదవైనాసరే ఆడి మాటే నీకు నమ్మకం ! అవునా ?"

చీకట్లో విచిత్రంగా మెరుస్తూన్న అగ్ని గోళాల్లాంటి ఆయన కళ్ళని చూస్తూ. నోట మాటరాక అలాగే నిలబడి పోయింది రాజమ్మ.

"చెప్పవే ! ఇంకేమన్నాడు ? రేపోమాపో సమితి ప్రెసిడెంటు కాబోతున్నాడు భుజంగంబాబు - ఆయనమీద లేనిపోని నింధలు ప్రచారం చేయమన్నాడా ? డబ్బు

లడుక్కోమన్నాడా? ఏ మన్నాడు నీ మొగుడు!" విలా సంగా కుర్చీ వెనక్కి చేరగిలబడి. హేళన ధ్వనింపజేస్తూ అన్నారు భుజంగం బాబుగారు.

బాబుగారి సెమత్కారం మాటలకి ఏటి జబాబు చెపుతది తనలాంటి తెలివి తక్కువ ఆడది! కాళ్ళక్రిందభూమి కదలిపోతున్నట్లుంటే. బలవంతాన శరీరాన్ని నేలమీద నిల దొక్కుకుని, తల వంచుకుంది రాజమ్మ.

"ఇప్పుడు నీకేం తక్కువైందే ఎర్రిమొహమా? తిండీ తిప్పలూ లేకలాగున్నావు గానీ, నెయ్యా మజ్జిగా తగిత్తే ఈ దొరసాన్లెందుకు పనికొస్తారు నీ ముందు. ఆ ఎదవసన్నాసి కోసం ఎందుకు బెంగెట్టుకుంటావుగాని, సీతమ్మని నమ్ముకో నీకు దారి చూపెట్టకుండా వుండదు - లోపల అమ్మగా రున్నారు, ఎల్లి అడుగు. ఓ పదిరూపాయలిచ్చి పంపిత్తది. పిచ్చివాగుడెక్కడా వాగమాక. ఉన్న ఊళ్ళో నీళ్లు పుట్ట కుండా చేసుకుంటావు," కుర్చీలోనుంచి లేచి వెళ్ళిపోయారు బాబుగారు.

బాబుగారి దర్జా నడకనీ, మాటల చమత్కారాన్నీ, కొసలో ఆయన వినిపించిన బెదిరింపులకీ అచ్చెరువొందుతూ, నిలబడిపోయిన రాజమ్మ చేతిలో పది రూపాయల కాగితం పెట్టి "ఇంక ఇంటికెల్లెహె పిచ్చి రాజమ్మా. పెద్దాళ్ళతో యవహారం నీకేటి సేతనవుద్దంట - ఎల్లెల్లు" అన్నాడు పోతరాజు.

ఆ పదిరూపాయల కాగితాన్ని అలాగే చేతిలో పట్టు కుని ఇంటిదారి పట్టింది రాజమ్మ.

"ఏమే! ఏం చేసుకొచ్చావు?" ఉయ్యాల బల్లమీద పడుకుని తాంబూలం నములుతూ, అడిగింది సీతమ్మ.

"ఏంటోనమ్మగారూ. బాబుగారు కూకలేసీ పంపేసినారు" దగ్గరలో చతికిలబడి, వారం రోజులనాడు దువ్వుకున్న చింపిరితలను రెండు చేతుల్తోనూ గోక్కుంది రాజమ్మ.

"పది రూపాయలిచ్చి పంపినట్టున్నారు" అన్నాడు ఆడంగి వెంకటనారాయణ.

"నీ కెందుకు నువ్వూర్కో" అని వాడివంక చుర చురా చూసింది.

"అవునుగాని రాజమ్మా - ఎల్లి పెరట్లో నీళ్ల కాగులో యేన్నీళ్లున్నాయ్ స్నానంచేసి, తల దువ్వుకో. యివ్వాళ నారాయణ రొయ్యలచారు బ్రహ్మాండంగా పెట్టాడు. చట్టిలో పోసుంచాడు నీకోసం. అదేసుకుని అన్నం తిను. ఊళ్లో జనం ఏదో అనుకుంటారు. అదంతా అర్థంచేసుకునే తెలివి నీకు లేదుగానీ - గమ్మనుండు. ఆ గుడిసెలో ఏం పడుంటావు. ఈడనే వుండు" అన్నది సీతమ్మ, రాజమ్మమీద దయావర్షం కురిపిస్తూ, "వుండ కేడికిపోతా నమ్మగారూ. అయ్యనీ, అమ్మనీవొగ్గేసి వొచ్చినాను. కులంకానాడితో లేసొచ్చినాను. ఇప్పుడెవరు సేరదీస్తారు నన్ను - మా అయ్య నాగురించి బెంగెట్టుకుని, ఏడ్చి ఏడ్చి సచ్చిండు - అమ్మేడున్నదో, బతికిందో సచ్చిందో నాకే తెలీదు - అన్నదమ్ము లున్నా రంటే ఎవుడి గొడవ ఆడిది-నన్ను సూసేది ఆ దేవుడొక్కడే ఇదిగో! నా కడుపున పుట్టిన ఈ సిట్టిగాడికోసం బతుకు తున్నాను - ఆడ్నేంసేసి పోతానమ్మగారూ."

"సరేలే - ఆ సోదికేంగాని వెళ్లి ముందు స్నానం చేసి తలదువ్వుకో" చిరాకుపడింది సీతమ్మ. ఒక్కొక్క మనిషికి డిగ్రీలు, చదువులూ, ఉన్నత సంస్కారం కలిగిన పరిసరాలూ వున్నా ఈ ప్రపంచంలో నెగ్గుకురాగల తెలివి తేటలూ, గడుసుదనం వుండవు. అవేవీ లేకపోయినా, తమకు గల లోకానుభవంతో, ఆలోచనా శక్తితో బ్రతుకుతూ తెలివితేటలు సంపాదించుకుని, అన్నిటా పై చెయ్యిగా వుంటారు మరికొందరు.

ఇంకా కొందరు ఎంత అనుభవం వున్నా తాము నమ్మిన సత్యాలనూ, తాము ఎరిగిన నీతి సూత్రాలనూ విడిచి పెట్టి లోక రీతిని యథాతథంగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించరు.

ఈ ప్రపంచంలో మనం సృష్టింపబడింది సుఖపడ్డానికే సని, ఆ సుఖపడ్డం అనే ధ్యేయసాధనకి, వచ్చే అడ్డంకులను ఏ మార్గంలోనైనా తొలగించుకోవడం అవసరమనీ అందుకు వెనుదీయరాదనీ నమ్మి కృషిచేసేవాళ్ళు ఎందరో!

కొంతమంది సుఖంకోసం తీసుకునే పునాది కంక కాలలోపడి నలిగి నశించిపోయి తమ జీవితాలను అర్పణ చేయడంద్వారా, ఇతరుల సుఖ సౌధాలను నిర్మించడానికి కారణం అవుతున్నవారి సంగతేమిటి? సుఖపడ్డానికీ కీర్తి సంపాదించడానికీ మూల సాధనం ధనం. డబ్బుంటే కిరా యిచ్చి ఎన్నైనా కొనవచ్చు. మాకుల్ని కొనవచ్చు. మను షుల్ని కొనవచ్చు. న్యాయశాస్త్రానికి క్రియ ప్రధానం. దాని వెనకవున్న ప్రేరణ చూడ్డానికి న్యాయమూర్తి తన

సింహాసనంమీదనుంచి కదలి క్రియ జరిగినచోటికే రాడు - అతను తన చెవులను నమ్ముతాడు.

కిరాయి మనుష్యుల కిరాయి సాక్ష్యాలు విని తీర్పు చెబుతాడు. క్రియ చేస్తూ పట్టుబడ్డ కిరాయి మనిషికి శిక్ష వేస్తాడు. క్రియ వెనకవున్న ప్రేరణ. పెద్దమనిషి ముసుగు కప్పుకుంటుంది. సింహాసనం ఎక్కుతుంది. పూల దండలతో పూజింప బడుతుంది.

ఈ లోకరీతిని అర్థం చేసుకోవాలంటే ఈ రాజమ్మ మరోజన్మ ఎత్తాల్సిందే!

"వెర్రిముండ!" అనుకుంది సీతమ్మ తాను నములుతున్న తాంబూలంలోని సుగంధ ద్రవ్యాల పరిమళాన్ని తనివితీరా ఆస్వాదిస్తూ.

"వెర్రిముండ" రాజమ్మ స్నానంచేస్తూ భుజంగం బాబుగారి మాటల్ని పదే పదే మననం చేసుకుంది.

"నిజమే కామోసుగా, భుజంగం బాబుగారికేటి పని ఆయన్ని సంపనుసేదాక! ఆయనమాత్రం ధర్మరాజు కాడా! ఈ మస్తానే తెగతాగిన మత్తులో వొళ్ళుతెలీక ఆ బాబుగార్ని చంపేసుంటాడు.

మస్తాన్ ఎంత తాగినా, ఆడు హత్యచేసేటంత కిరాతకుడు కాడు. కాడని రాజమ్మ అంతరాత్మ అంటూనేవుంది. తానేటి సెయ్యడం! అంతా అయిపోయినాక - కేసు కోర్టుకెడుతుంది. మస్తాన్‌కి శిక్ష పడుతుంది. తప్పదు - ఇకను వాడికోసం ఆలోచించడం, ఆశపడ్డం అనవసరం - చిట్టిగాడ్ని పెట్టుకుని రోజులు తెల్లవార్చుకోవాలి - ఆణ్ణి పెంచి పెద్ద

చేయాలి. సదివించాలి. ఉద్యోగం వచ్చినాక అప్పుడు హాయిగా సచ్చిపోవాలి. అందాక బతకాల్సిందే.

"ఏందే రాజమ్మా ఆలోచిస్తున్నావు?" సీతమ్మగారు దాన్ని పలకరించింది, చిరిచాప పరుచుకుని పడుకోబోతూ వుండే.

"ఏంటి లేదమ్మగారూ - నా గురించే. ముందేం జరగాలా అని ఊరికే బెంగైపోయినాది."

"ఈ ఆలోచన ముందుండదే నీకు."

"నానొట్టి తెలివితక్కువదాన్నమ్మగారూ."

"అది నిజమేననుకో. నువ్వు తెలివితక్కువదానివి కూడా కాదు. స్వార్థమంటే ఏమిటో తెలియకుండా-ఎప్పుడూ పరులకోసం బతకడం అలవాటుచేసుకున్నదానివి. అందుకేనే నీకీ కష్టాలు."

"అదంతా నా కర్థం అవుద్దేంటమ్మా!"

"ఎందుక్కాదే వెర్రిముండా! కొంతమంది ఎప్పుడూ తమని గురించీ, తమ సుఖంగురించీ ఆలోచించుకుంటారు. నువ్వలాంటి దానివికాదు. ఇకనైనా నిన్నుగురించి నువ్వు జాగ్రత్త తీసుకుని హాయిగా బతుకు. ఆడు జైలులోపడ్డం కూడా నీమంచికే అనుకో! ఈ ఊరొచ్చినప్పుడు ఎంత చక్కటిదానివి. మాలాంటి ఇళ్ళల్లో పుట్టి పెరగవలసిన కళ వుంది నీకు. అలాంటిదానివి బొగ్గులాగ తయారైనావు. సున్నంలోకి ఎముక లేదుగదా! సుఖపడ్డానికి ఎన్నో మార్గాలున్నాయే వెర్రిదానా. నీకు ముందు ముందు తెలుస్తాయి.

ఎప్పుడో అమ్మమ్మా, నాయనమ్మా చెప్పిన పతివ్రతల కథలూ, సత్యహారిశ్చంద్రుడి కథలూ మనసులో పెట్టుకుంటే నువ్వు కాదు ఆ భగవంతుడుకూడా సుఖపడలేడు. ఈ ప్రపంచము పద్ధతి వేరు. సరే ఇవ్వాల్టికి పడుకో! మద్దెన నా గోడవెందుకు" గీతోపదేశం చేసి, కర్తవ్యోన్ముఖురాల్ని చేసినంత గర్వంతో వొళ్లు విరుచుకుని తన గదిలో ఫోమ్ పరుపుమీదకు వెళ్ళిపోయింది సీతమ్మ.

భుజంగం బాబుగారి మాటలకన్నా అమ్మగారి మాటలు మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తూవుంటే. వాటి అర్థాలూ, ఆంతర్యాలూ తెలియాక తికమకపడ్తూ నిద్రలేని రాత్రి గడిపింది రాజమ్మ.

# 3

సత్యహారిశ్చంద్రుడిలాంటి తండ్రి కడుపున పుట్టి, తన వూరూ, తన యిల్లూ, తన మనుషులే కాక, బయటెంతో విశాల ప్రపంచం వుందని కనీసం పొరపాటున కూడా ఆలోచించడం ఎరగని రాజమ్మ, మస్తాన్ మాటల మాయలోపడి. ఉన్న ఊరునూ, అయిన మనుష్యులనూ వదులుకుని వచ్చినా, తాను కాపురం పెట్టిన చిన్న ఇల్లూ, తను పనిచేస్తున్న ఇల్లూ తప్ప మరో ఊసే లేకుండా ఇన్నాళ్ళూ గడిపింది. అంతే కాదు - తనతోపాటు జీవితం పంచుకుంటున్న మస్తాన్ మన స్తత్వాన్ని సైతం ఆమె అంచనా వెయ్యలేకపోయింది.

తను రోజులో పన్నెండు గంటలు ఎక్కడ గడుపు

తోందో అక్కడ జరిగే వింతలూ, విశేషాలనూ కూడా ఆమె గ్రహించలేకపోయింది.

అలాంటి రాజమ్మను, రెండు నెలలలో తీర్చి దిద్దింది సీతమ్మ.

రాజమ్మ కొడుకు చిట్టిబాబు పంచాయితీ బడికి పోతున్నాడు బలపం, పలకా పుచ్చుకొని.

ఎప్పుడైనా "అయ్యేడికి పోయినాడమ్మా?" అడుగుతూ వుంటాడు.

"మన్నిడిసిపెట్టి బొంబాయి ఎల్లిపోనాడు. ఇంక మరి రాడు" అంది రాజమ్మ.

పధ్నాలుగేళ్ళంట వాడికి శిక్ష - జైల్లో సరిగ్గావుంటే మంచితనం క్రింద కొంత తగ్గిస్తారట.

వాడొచ్చి, తనని ఉద్ధరిస్తాడన్న ఆశను రోజురోజుకీ చంపేయసాగింది సీతమ్మ.

రాజమ్మ ఇప్పుడు అమ్మగారిల్లొదిలి రావడంలేదు. పడకా, తిండీ అన్నీ అక్కడే. బజారుకికూడా రాదు.

నాలుగు నెలల తరువాత ఆమెని చూసినవాళ్ళంతా ఇప్పుడు రాజమ్మకి చాయ వచ్చిందని, దాని తీరే మారి పోయిందనీ చెప్పుకుంటున్నారు.

రెండేళ్ళల్లో ప్రపంచంలో చాలాభాగం అర్థం అయి పోయింది రాజమ్మకి.

సీతమ్మగారింటికి పెద్ద పెద్దోళ్ళంతా ఎందుకు వస్తారో, ఆమెగాచు ఊరికి చివర వొంటిస్థంభం మేడలో ఏల వుంటు

న్నారో భుజంగం బాబుగారు, సీతమ్మగారిని ఎలా కనిపెట్టి కాపాడుతున్నారో, ఆమెగారిద్వారా భుజంగం బాబుగారు ఎలా పదవులూ, పరపతీ పెంచుకుంటున్నారో అన్నీ ఆకళింపుకి వస్తున్నాయి.

భుజంగం బాబుగారి పదవీవ్యామోహానికీ, ధన దాహానికీ సుబ్బరామయ్యగారు ఎలా అడ్డంకి అయిందీ, ఆ అడ్డంకి తొలగించుకోడానికి మస్తాన్‌ని ఉపయోగించుకుని, వాణ్ని పోదిలోకి లేకుండా జైలుకి పంపడానికీ – అన్నీ ఇప్పుడర్థం అయ్యాయి రాజమ్మకి. ఇంటి కెవరేనా వచ్చినప్పుడు –

"రాజీ – ఆ కాఫీ కప్పులిల్లా పట్రా" అంటారు సీతమ్మగారు.

అప్పుడే 'రాజీ' అని పిలువబడ్డ రాజమ్మ పెద్దపెద్ద పువ్వులున్న నైలెక్స్ చీరకట్టి పల్చటి జాకెట్టు తొడిగి, మొహానికింత పౌడరు పట్టించి, సెంటువాసన నలువైపులా ప్రసరింపచేస్తూ, ట్రే పట్టుకుని ప్రవేశించి నమస్కారం చేస్తుంది. రాజమ్మకి శాశ్వతంగా ఉద్యోగం యిచ్చాక ఆడంగి వెంకట నారాయణ్ణి పంపించేసింది సీతమ్మ. వాడొట్టి వెధవ. అక్కడ కబుర్లిక్కడ, ఇక్కడ కబుర్లక్కడ పొక్కించేస్తూ వుంటాడు.

ఎప్పుడైనా సెలవులకి పాప ఇంటికొచ్చినప్పుడు కూడా ఆ పిల్ల ఎదుట అక్కర్లేని విషయాలన్నీ మాట్లాడతాడు. అటువంటి వెధవ పన్లు చెయ్యకుండా రాజమ్మని క్రమ శిక్షణలో వుంచింది సీతమ్మ.

తానేంచేసినా ఎలా బ్రతికినా చిట్టిగాణ్ణి మాత్రం బాగా చదివించి పెద్దవాణ్ణి చేయాలని రాజమ్మ ఆరాటం.

అందుకోసం ఎవరు ఏమి ఇచ్చినా జాగ్రత్తగా దాచి పెట్టేది. చిట్టిగాడు హైస్కూల్లో చదువుతాడు - కాలేజీకి వెడతాడు- సీతమ్మగారి పాపలాగ డాక్టరు అవుతాడు- ఎందుకాకూడదూ !

ఈ నాలుగేళ్ళల్లో నాలుగొందలు కూడపెట్టింది రాజమ్మ - చిట్టిగాడికి మంచి బట్టలు కుట్టించింది.

అయితే రాజమ్మ కలలు నిజం కావడానికి పెద్ద విఘాతం కలిగింది.

సీతమ్మగారి కూతురు పాప చదువైపోయింది.

ఆ పిల్ల మరో డాక్టర్ని పెళ్ళాడేసి గుంటూర్లో పెద్ద ఆసుపత్రి కట్టించేసింది. తల్లిని మకాం మార్చేస్తేగాని వీల్లేదని పట్టు పట్టింది. ఎంత చెప్పినా వినలేదు.

సీతమ్మగారితోపాటు రాజమ్మ కూడా గుంటూరెళ్ళిపోయింది.

అయితే సీతమ్మగారి పద్ధతివేరు. పాపమ్మగారి పద్ధతి వేరు. ఆ పిల్ల రాజమ్మచేత నైలెక్సు చీరెలు కట్టడం మాన్పించేసింది. తెల్ల చీరెలు కట్టుకోమంది, ఆసుపత్రిలో గదులు తుడవమంది, పువ్వులూ, సెంట్లూ వాడ్డానికి వీల్లేదంది, ఎవరికి కాఫీ లిచ్చినా దూరంగానిలబడి నమస్కారం చెయ్యాల్సిందేగాని వ్రేళ్ళూ, కాళ్ళూ తాకడానికి ససేమిరా కుదరదంది. అలా గుండదలిస్తేనే అక్కడుండమంది.

చిట్టిగాడ్ని మాత్రం మంచి స్కూల్లో వేసి చదివిస్తానంది. తల్లికీ కూతురికీ ఆరు నెలలకే అభిప్రాయభేదాలొచ్చేశాయి.

"నీ మోచేతినీళ్ళుతాగే కర్మ నాకేమిటే వెర్రిపిల్లా - నా ఇష్టం వచ్చినట్లు నేనుంటాను -" అని రామాపురం వొచ్చేసింది సీతమ్మ.

రాజమ్మకి డాక్టరమ్మని విడిచిపెట్టి రావడం యిష్టం లేదు. అక్కడ సెంట్లూ, సిల్కుచీరెలూ లేకపోయినా, ప్రశాంతంగా వుంది - కానీ రాజమ్మని అక్కడుంచడానికి వీల్లేదంటూ లాక్కునిపోయింది సీతమ్మ.

దానితో పాటు కొడుకూ స్కూలు మానేసి పల్లెటూరొచ్చేక తప్పలేదు.

ఆవూరొచ్చీరాగానే ఖాయిలాపడిపోయింది రాజమ్మ — మామూలు జ్వరమూ తల నొప్పీకాదు - మశూచే సోకింది.

మశూచి వ్యాధి వొచ్చిన రాజమ్మని తన ఇంట్లో క్షణం వుండనీయలేదు సీతమ్మ. వెంటనే గుడిసెలోకి చేర్పించేసింది. చావు తప్పి కన్ను లొట్టపోయిందన్నట్లు ఒక కంట్లో పువ్వేసిపోయింది రాజమ్మకి. మొహంనిండా సందులేకుండా పోసింది అమ్మవారు, ఆమెనిచూసి పిల్లలు దడుసుకుని పారిపోయారు. పెద్దవాళ్ళు ఉలిక్కిపడి వెన్ను చరుచుకున్నారు. "అయ్యో పాపం" అన్నారు కొంతమంది.

మశూచి వచ్చి తగ్గిన రాజమ్మకి సీతమ్మగారింటి తలు

పులు తెరుచుకోలేదు. నాలుగు పాత చీరెలూ, పది రూపాయలూ యిచ్చి దాని ఋణం తీర్చుకుని చేతులు దులుపుకుంది.

దయగల తల్లి సీతమ్మ.

భుజంగం బాబుగారు దర్శనంకూడా యివ్వలేదు ఆయన ధర్మపత్నిమాత్రం జాలిపడి పావుమూట వడ్లు కొలిపించి పంపింది.

సుబ్బరామయ్యగారు పోయాక ఆయన కొడుకులు విడిపోయి, ఆస్తులు పంచుకుని పట్నాలకు పోయారు. అరుంధతమ్మ మాత్రం వున్న వూరు విడిచిపెట్టలేక అక్కడే వుండిపోయింది. ఆమెకు పనిమనిషి అక్కర్లేదు. అవసరమైనా మస్తాన్ పెళ్ళాం ప్రతిక్షణం ఆవిడ తన కళ్ళఎదుట వుండడము భరించలేదు.

ఇంక ఆ పల్లెటూళ్లో రాజమ్మని ఎవరు పనికి పెట్టుకుంటారు?.

పొలం పన్లకిపోయి. ఎండలో నిలబడలేక కళ్లు తిరిగి పడిపోయింది.

జబ్బుపడి లేచాక నీరసం అయిపోయింది.

"ఈ పల్లెటూళ్లో నువ్వేం బ్రతుకుతావే ఎర్రిముండా! పట్నం పోతే నాలుగిళ్ళల్లో అంట్లైనా తోముకుని బతకొచ్చు" అని సలహా యిచ్చింది మాణిక్యం. మళ్ళీ డాక్టరమ్మని ఆశ్రయించింది రాజమ్మ.

"చూడు రాజమ్మా— ఆస్పత్రిలో వుండేవాళ్లంతా

రోగులు. వాళ్ళ కసలే ఆందోళనగా, భయంగా ఉంటుంది. వాళ్ళు నీ మొహంచూసి భరించలేరు. ఇంకేదైనా పని చూసుకుందూ" అని పంపించేసింది డాక్టరమ్మ.

మాణిక్యం చెప్పినట్లు, పాత ఊళ్లో చిన్న గుడిసె అద్దెకు తీసుకుని, అక్కడా అక్కడా అంట్లుతోమి, తిని తినకా రోజులు గడుపుతోంది రాజమ్మ.

గుడిసెల్లో పిల్లల్తో గోళీలు, బెచ్చాలూ ఆడుతూ మట్టిలో దొర్లుతూ, యిష్టం వున్నప్పుడు బడికిపోతూ, లేనప్పుడు మానుతూ నాటకం ఆడుతున్న చిట్టిగాణ్ణిచూస్తే కడుపు తరుక్కు పోతోంది. తన ఆశ ఫలించలేదు. తన కల నిజం కాలేదు. కలలు కన్న కన్ను గ్రుడ్డిదై పోయింది. ఆశపడ్డ మనస్సు మూగదై పోయింది.

తన పుట్టిల్లు తల్చుకున్నప్పుడల్లా బాధగా వుండేది రాజమ్మకి. తిండికి లోటులేదు. వాకిట్లో వడ్లపాతర ఏడాది తిండికీ సరిపడ గింజలుండేవి. అయ్య రెక్కల కష్టంతోనే రెండెకరాల పొలం కొన్నాడు. తనకి నాగరం, జడకుప్పెలూ ఎర్రరాళ్ళ జోడు వుండేవి. అవన్నీ కలిసి ఐదుతులాలు. అన్నీ అమ్మేసినాడు మస్తాన్ - అదేమంటే "నీ ముష్టి బంగారం మళ్ళీ కొని నీ కివ్వలేనా ఏమిటే! ఏడుస్తావ్! మంచిరోజులు రానీ!" అనేవాడు.

ఇప్పుడు బంగారం ధర పెరిగింది.

అవి వుంటే చిట్టిగాడి చదువుకైనా వచ్చేవి. అంతా తన తలరాత! ఎవర్నని ఏమిలాభం? లోకంలో ఎంతమంది లేరు? తనకే రావాలా మశూచి?

## 4

కుచేలోపాఖ్యానం హరికథ జోరుగా సాగుతోంది. హరిదాసుగారు మధ్య మధ్యలో పిట్టకథలు చెప్తూ, ఛలోక్తులు విసురుతూ, రాగాలు ఆలాపిస్తూ హుషారుగా స్టేజీ మీద చిరుతలు వాయిస్తూ అటునుంచీ ఇటూ ఇటునుంచీ అటూ తిరుగుతున్నాడు. మధ్యమధ్య శ్రీమద్రమారమణ గోవిందో హరి! అంటున్నాడు. పందిరి స్తంభాని కానుకుని నిద్రపోతున్నాడు చిట్టిబాబు.

చిట్టిబాబు కిప్పుడు పన్నెండేళ్లు.

తల్లి బాధ పడలేక ఐదుక్లాసులు ఎలాగో చదివాడు. ఆ పైన వాడిని బడికి పంపడం రాజమ్మతరం కాలేదు. పగలంతా ఎక్కడెక్కడో తిరిగొస్తాడు. ఇష్టంవుంటే స్నానం చేస్తాడు. తల్లిని బెదిరించి ఉన్న దేదో తనే సుష్టుగా తింటాడు. అమ్మని "తిన్నావా" అనైనా అడగడు. వాడిలో యిప్పుడు తండ్రిపోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, గుణం కూడా తండ్రిదే !

వాడికోసం దిగులు పడీ పడీ రాజమ్మ గుండె రాయైపోయింది. గింజలున్ననాడు ఇన్ని పుల్లలుకొని మంటపెట్టి ఉడకేసి. ఆ గిన్నె అక్కడపెట్టి గోడకానుకొని కూర్చుంటుంది.

మస్తాన్‌కు శిక్ష ఇంకెన్నాళ్లో ఆమెకి తెలియదు. అతని

కబురేమీ ఆమెకి చేరలేదు. అతను జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కళ్ళ వెంట నీళ్లొస్తాయి.

ఒకవేళ వాడు తిరిగొస్తే, తనని చూసి జడుసు కుంటాడు.

"నీ అందం ఏ సినిమా స్టార్లకీ లేదే రాజమ్మా!" అన్న నోటితోనే, నువ్వు నా రాజమ్మవి కావు! అంటాడు. వాడికి అన్నీ శుభ్రంగా, అందంగా వుండాలి. తను పాపం చేసింది. అందుకే దేవుడిలాగ శిక్షించాడు!

పాపం, పుణ్యం, అవ్వన్నీ అబద్ధం అని సీతమ్మగారు చెబితే తను నమ్మింది. నిజమే అనుకుంది. అనుకోక ఏం చేస్తుంది!

తనకన్నా ఎక్కువ పాపాలు చేసినవాళ్లు ఎంతో సుఖంగా వున్నారు. పట్టుపరుపులమీద పవ్వళిస్తూ, ఎయిర్ కండిషన్డు గదుల్లో నివసిస్తూ, వున్న డబ్బు దాచుకోడానికీ ఖర్చుపెట్టుకోడానికీ మార్గాలు అన్వేషిస్తున్నారు. కానీ, తను మాత్రం ఇలాగైపోయింది.

దేవుడూ దయ్యం, పుణ్యం, పాపం, విధి, కర్మ. యివన్నీ మనం కల్పించుకున్న వేనని సీతమ్మగారు చెబుతుంది. మరి ఈ మహాచివ్యాధి తను కోరితే వచ్చిందా? కావాలని తెచ్చిపెట్టుకున్నదా! హరికథ వినడంలేదు రాజమ్మ. ఆలోచనలతో అలసిపోతోంది. ఏమీతోచక అక్కడకొచ్చింది.

ఆమె కూర్చున్నచోట ఎవరూ కూర్చోరు. దూరంగా వెళ్ళి కూర్చుంటారు.

హరికథ అయిపోయింది కాబోలు హారతిపళ్ళెం పుచ్చుకుని మనిషి మనిషినీ వెతుక్కుంటూ వస్తున్నారు దాసుగారి శిష్యులు. రాజమ్మ దగ్గరకు ఎవరూ రారు. ఆమె లేచి చిట్టిబాబును లేపుకుని ఇంటికి వచ్చింది.

గుడిసెల దగ్గర తగాదా అవుతోంది. అలాంటి తగాదాలు రోజూ జరుగుతూనే వుంటాయి.

రిక్షాలాగే వెంకటయ్య, వాడి పెళ్ళాం సుందరమ్మని జుత్తు పట్టుకుని గుడిసెలోంచి బయటికి లాక్కొచ్చి వీపుమీద, కసికొద్దీ బాదేస్తున్నాడు.

అదేమిటని అడ్డువచ్చిన ప్రక్కింటి రాజయ్యనీ, పెళ్ళాన్నీ కలిపి బూతులు తిడుతున్నాడు. కాసేపటికి పెళ్ళాం జుత్తు వదిలేసి రాజయ్యతో కలియబడ్డాడు. సుందరమ్మ ఏడుస్తూ గుడిసెల్లోకి వెళ్ళిపోగా, కొంతమంది ఆడవాళ్ళు ఆమెను సముదాయించడానికి వెళ్ళారు.

చాలామంది వినోదం చూస్తున్నారు. రెండో ఆట సినిమానుంచి తిరిగి వచ్చినవాళ్ళంతా అక్కడ పోగయ్యారు. ఆ గుడిసెల్లో నివసించే వాళ్ళల్లో సగంమంది రోజూ సినిమాకి పోతారు.

మస్తాన్ చేతిలో తనూ చాలాసార్లు దెబ్బలుతిన్నది రాజమ్మ, కానీ ఒక్కసారైనా ఈసుందరమ్మ లాగా అతణ్ని తిట్టి ఎరుగదు. తిట్లు తిన్నా, దెబ్బలుపడినా మస్తాన్‌ని తానెన్నడూ ఏవగించుకుని ఎరగదు.

చిట్టిగాడు అల్లరిచేస్తే తను కొడుతుంది. తిడుతుంది. కానీ ఆఖరు రాత్రి అయ్యేసరికి, తన ప్రక్కలో దూరి నిద్ర

పోతాడు. అంతేగా మరి! బూటు పాలీష్ చేసుకోమని, ఐస్‌ఫ్రూట్‌లు అమ్మమనీ తాను ఎన్నోసార్లు చిట్టిబాబుని చివాట్లు పెట్టింది. కానీ వాడు ఏ పనీ సరిగ్గా చేయలేదు.

గుడిసెబయట అరుగుమీద దిగాలుపడి కూర్చుంది రాజమ్మ.

"ఏం రాజమ్మప్పా! అలా కూర్చున్నావు!" అంటూ దగ్గరగా వచ్చాడు ముప్పైఏళ్ళ వాడొకడు.

వాడు దగ్గరకు రాగానే సెంటువాసన కడుపులో తెమిల్చింది. చౌకరకం సెంటూ, సిగరెట్టుపొగా, చెమటా కలగలిపిన వెగటువాసన.

"ఎవరు బాబూ?"

"నేను రత్తాలు తమ్ముణ్ణి. వచ్చి వారంరోజులాయె చూడనేలేదా ఏమిటి నన్ను." రత్తాలుది ప్రక్క గుడిసె. దానికో తమ్ముడున్నాడని రాజమ్మకి తెలీదు. మొన్నిమధ్య చెప్పినట్టే గుర్తు. పిన్నవమ్మ కొడుకట-పట్నంనుంచి వచ్చాడట. అక్కడేదో పెద్ద ఉద్యోగమట. తన గుడిసెలో వుండలేక హోటల్లో వుండి చూడ్డానికొచ్చాడట అతగాడేనేమో!

నీ కథంతా విన్నానప్పా. పాపం జాలేస్తావుంది నాకు."

రాజమ్మ ఏమీ మాట్లాడలేదు.

"ఎల్లుండి పొద్దుగాల ఎలిపోతున్నా. చిట్టిగాడ్ని నా ఎంట పంపితే బాగుచేద్దామనుంది. ఏమంటావ్!"

ఉలిక్కిపడి తల ఎత్తింది రాజమ్మ. దేవుడున్నాడు. దయ్యంఉంది. పుణ్యంపాపం ఉంది. సీతమ్మగారిదంతా అబద్ధం.

"మా నాయనే - మా తండ్రే సచ్చి నీ కడుపున బుడతా-" కళ్లు తుడుచుకుంది.

ముప్ఫై ఏళ్ళవాణ్ణి "మా నాయనే" అన్న రాజమ్మకి యింకా ముఫ్ఫై ఏళ్లు రాలేదు. కానీ ఆమె మూడు ముప్ఫైలు దాటినంత ముసలిదై పోయింది.

"అంతమాటనకు అప్పా. నా దసలే జాలిగుండె - నీ కష్టం అంతా రత్తాలు చెపితే నాగుండె పగిలిపోయిం దనుకో - అందుకే ఇప్పటిదాకా మేలుకుని ఆలోచించా - చిట్టిగాడ్ని పెద్దాణ్ని చేసి నీ కష్ప జెప్పే బాధ్యత నాది. ఆడి కోసమేగా నీ ఆరాటం. నువ్వు కొన్నాళ్లు హాయిగా వుండు. వాణ్ణి నాతో పంపు".

"నీ ఇష్టంబాబూ! దేవుడే నా మొర ఆలకించా డనుకో, నీ పేరేమిటి నాయనా?"

"నా పేరు చంద్రం. మనమంటే పట్నంలో అందరికీ బేజారు. పట్నం అంటే చెన్నపట్నం కాదు. ఇసాపట్నం. వైజాగ్."

మరునాడు ప్రొద్దున్న -

"రత్తాలుపిన్ని తమ్ముడుతో పట్న వెళ్తావంటరా చిట్టీ!" అని తల్లి అడిగితే.

"ఆ దొరబాబు సానా మంచోడు - నిన్నపొద్దున బిస్కట్లు కొనిచ్చినాడు ఎడతానే" అని హుషారుగా తల వూపాడు.

వారం రోజులనుంచీ చంద్రం, చిట్టిబాబుకు బోధ చేస్తూనే వున్నాడని రాజమ్మకి తెలీదు.

"చాకులాంటి చురుకైన కుర్రవాడుస్మీ!" – అనుకున్నాక ఏవిధంగానైనా వాణ్ని తీసికెళ్ళాలని చంద్రం ప్రయత్నం.

"వస్తానమ్మా" అని వాడు బస్సు ఎక్కుతుంటే రాజమ్మ రెండు చేతుల్లోనూ మొహం కప్పుకుని బావురుమని ఏడ్చింది.

అలా వారం రోజులవరకూ ఏడుస్తూనేవుంది. ఇప్పుడు చిట్టికూడా లేడు. తన యిష్టమొచ్చినప్పుడు వండుకుని తింటుంది, లేకపోతే చాపమీద ముసుగుకుని పడుకుంటుంది.

# 5

చారల ప్యాంటు తొడిగి, గళ్ళచొక్కా వేసి, దుబ్బ జుట్టు నీటుగా దువ్వి ఈల వేసుకుంటూ సైకిలెక్కి బయలుదేరాడు చిట్టిబాబు. వాడు విశాఖపట్నం వచ్చి ఎనిమిది నెలలైంది. ఇన్ని నెలలనుంచీ చంద్రం అనబడే వీరాస్వామి వాడికి చాలా నేర్పాడు. గురువును మించిన శిష్యుడిలా తయారుచేశాడు. అంత గొప్పవాణ్ణిచేసి వాడి పుణ్యాన వాణ్ణి విడిచిపెట్టలేదు. అతగాడికి చిట్టిబాబులాంటి శిష్యులు చాలామంది వున్నారు. అందరికీ గురువంటే భక్తికన్న భయమే ఎక్కువ. పదేళ్ళ సూర్యం చిరిగిన చొక్కా, గుండీలులేని నిక్కరూ వేసుకుని బూట్‌పాలిష్ చేస్తూ ఉంటాడు. అలా బూటుపాలిష్ చేస్తూనే ఓ చక్కని పర్సో, బంగారప్పు

గాజో, వుంగరమో, జడబిళ్లో పట్టుకొచ్చి గురుదక్షిణ యిస్తూవుంటాడు.

తను సంపాదించిన డబ్బు గురువుగారి కివ్వడం ఎందుకు? తనే వుంచుకోవచ్చుకదా - అనే దుర్బుద్ధి వాడి కెప్పుడూ కలగదు - కలిగిందో - వాడి వీపు వాచిపోయిందన్నమాటే అంతేకాదు వాడు అప్పటి కప్పుడు పోలీసుల చేతిలో చిక్కిపోతాడు.

బుద్ధిగావుంటే, దొరికిందేదో గురువుగారికి సమర్పిస్తే రూపాయో రెండో బహుమానం దొరుకుతుంది. నాగేస్రావో, ఎన్టీఆరో సినిమా చూడొచ్చు. మెరపకాయ బజ్జీలో, సోడానీళ్ళో కొనుక్కోవచ్చునని గ్రహించాడు వాడు.

వీరాస్వామికి ఇరవై ఏళ్ళ శిష్యుడింకొకడు వున్నాడు. వాడు బస్కీలుతీసి, కసరత్తులుచేసి, వస్తాదులా తయారైనాడు. సూర్యాన్ని, చిట్టిగాడ్ని ఓ కంట కనిపెట్టి వుండమే గాక, గురువుగారికి అంగరక్షకుడుగానూ, గురువుగారి భార్యగారికి పి. ఏ. గానూ వుపయోగపడతాడు.

ఇక గురువుగారి భార్యపేరు సావిత్రి.

తెలుగు సినిమాతారలా తెగ వొళ్లుచేసింది. పెద్ద పెద్ద పువ్వులు, ముదురురంగులు, గళ్ళు - చదరాలు వున్న సిల్కుచీరెలు కట్టి, పొట్టి చేతుల పల్చటి జాకెట్లు వేస్తుంది. రంగురంగుల పూసలతో రాళ్ళతోచేసిన గిల్టునగలు ధరిస్తుంది. బాగా ప్రక్కపాపిడి తీసి చెవులమీదుగా క్రిందకు దువ్వుతుంది. పాపిట్లో రంగుకుంకుమ అద్దుతుంది. కళ్ళకు

కాటుక పెట్టి కొసలు పొడుగ్గా దిద్దుతుంది. వుండీవుండీ శిష్యుల వీపులు చరిచి పెద్ద పెట్టున నవ్వుతుంది. ఆవిడ నవ్వినప్పుడు భూకంపం వచ్చిందేమోనని ఓసారి వొణికిపోయాడు చిట్టిబాబు.

సావిత్రి రోజులో చాలాభాగం మడత మంచంమీద పడుకొని నిద్రపోతూ వుంటుంది. అన్నం కూడా వండదు. అంగరక్షకుడో, గురువుగారో, సూర్యంగాడో అన్నం వండుతారు.

గురువుగారు సైతం సావిత్రమ్మంటే భయపడతారు. ఆవిడ ఒక్కొక్కరోజు బలి కోరుతున్న క్షుద్ర దేవతలాగా ఎర్రటి కళ్లు మరీ పెద్దవిచేసి జుత్తు విరియబోసుకుని గావుకేకలు వేస్తుంది. అవికూడా సాక్షాత్తూ గురువుగారిమీదే.

ఇసాపట్నం రాకముందు చిట్టిగాడికి – "పెపంచం" అంటూ గురువుగారు చూపించిన "పెపంచం"– అంటే ఏమిటో తెలీదు.

గోళీలూ, బెచ్చాలూ ఆడడం, తల్లిని అదిరించీ, బెదిరించీ వున్నది తినడం, సినిమాహాళ్ల దగ్గర తిరగడం, పావలో, అర్ధో వున్ననాడు సినీమా చూడడం– యిలా వుండేది వాడి జీవితం.

కానీ ఇప్పుడు వాడికి సినిమా హాళ్ళదగ్గర వూరికే తిరగక్కర్లేదనీ, రోజూ కనీసం ఓ పర్సో, ఓ రిస్టువాచీయో, ఓ కళ్ళజోడో సంపాదించవచ్చనీ అర్థం అయింది. అవి సంపాదించడంలో వాడు ఎంత నేర్పూ, ఒడుపూ సంపాదించిందీ

C. P. BROWN MEMORIAL
LIBRARY, CUDDAPAH.
Acc. No 5521

చూసి గురువుగారే ఆశ్చర్యపోతూ వుంటారు. ఒక్కొక్క సారి.

తన తండ్రి ఎవర్నో చంపి జైలుకెళ్ళాడని. తన తల్లీ తండ్రీ ఒక మతంవారు కారనీ ఇరుగూ, పొరుగూ వాడి కెప్పుడో తెలియజెప్పారు.

ఓసారి ఓ పర్సు తెచ్చి చంద్రానికిచ్చాడు చిట్టిబాబు. దానికోసం సావిత్రీ, చంద్రం ఇద్దరూ తగూలాడుకున్నారు. చివరికి అందులో చూస్తే రెండువందల రూపాయలున్నాయి.

"ఊరికే కంగారు పడమాకేవ్ - కావాలంటే ఓ వంద తీసుకుని నైలెక్సు చీరె కొనుక్కోరాదేటి!" అన్నాడు చంద్రం సంబరాలు పడుతూ.

ఆ రోజు సావిత్రి, చిట్టిబాబుకి ఉలవచారు వండి పోసింది. కోడిగ్రుడ్ల కూర కూడా కొంచెం వేసింది.

"ఈ ఎదవకి టెర్లిన్ సొక్కా కుట్టించు మావా. పాపం దొరబాబు లాగుంటడు. కర్మ కాలి ఇలాగై పోనాడు" అన్నది వీపు తట్టి.

"వీడి కరమే కాల్లేదే ఎర్రి మొహమా. విడి జాతకం ఏటో నీకేం తెల్సు! ఈడి తల్లి మతం కానోడితో లేసొచ్చి నాది. ఈడి అయ్య హచ్చచేసి జైలు కెల్లినాడు. మరి ఈడికీ యిద్దె కాక మరేటి సేతనవుద్ది! అందుకే ఈడి బుద్ధి కుశలం కనిపెట్టి ఇక్కడికి తెచ్చినాను. మీసం మెలివేస్తూ చెప్పాడు వీరాస్వామి.

ఆ మాటలు వింటే చిట్టిబాబు కెందుకో బాధ కలి

గింది. అక్కడికొచ్చిన క్రొత్తలో చంద్రం మామ తనని బాగానే చూసేవాడు. రెండు మూడు మంచి జతల బట్టలు కుట్టించాడు. సైకిల్ తొక్కడం నేర్పాడు. క్రొత్త దువ్వెన పౌడరు డబ్బా కొనిచ్చాడు.

ఆ బట్టలేసుకుని సైకిల్ మీద బజారెడితే తను దొరల పిల్లడిలాగే ఉంటాడు. ఎవరూ అనుమానాలు కట్టలేరు.

పూర్ణా మార్కెట్ దగ్గర, జగదాంబ హాలుకాడ. రైల్వేస్టేషను దగ్గర, బస్ స్టాపుల దగ్గర, ఒకచోటేమిటి అనేకచోట్ల తను అచ్చం స్కూలు పిల్లవాడిలాగే అందరితో కలిసిపోయి, తన హస్త కౌశలం ప్రదర్శించాడు.

చిట్టిబాబు సైకిల్ త్రొక్కుకుంటూ వచ్చి బజారులో ఓ కిళ్ళీకొట్టు దగ్గర సైకిల్ నిలబెట్టి, ఓ సినిమా పత్రికలో బొమ్మలు చూడసాగాడు.

"రూపాయండి బాబూ, కొనేనుకుంటారేటి !" అన్నాడు షాపు యజమాని.

"ఇలాంటి బుక్స్ కొంటే ఇంటి దగ్గర తిడతారోయ్. అందుకోసం బొమ్మలు చూసేసి పోతాను-" అన్నాడు చిట్టిబాబు— ఫోజుగా.

బయటకు వెళ్ళినప్పుడు ఎటువంటి భాష మాట్లాడవలసిందీ -- తను ఎవరి అబ్బాయని చెప్పవలసింది -- నిద్రలో కూడా మర్చిపోడు చిట్టిబాబు.

"బాబు గారేటి సదువుతున్నారో -- గోల్డుస్పాట్ గాని పుచ్చుకుంటారేటి !" అన్నాడు కిళ్ళీకొట్టు సింహాచలం మళ్ళీ.

"హార్దోయ్ ఇది గోల్డుస్పాట్ పుచ్చుకునే టైమ్ కాదు." దర్జాగా చెప్పాడు చిట్టిబాబు.

పుస్తకం కళ్ళకి అడ్డం వుందన్న మాటే గాని, అత గాడి చూపంతా వేరేచోట వుంది.

అది శనివారం సాయంత్రం. అందులోనూ నెల మొదటి శనివారం సాయంత్రం.

మెడికల్ కాలేజి అమ్మాయిలు, ఆడపిల్లల కాలేజి లెక్చరర్లు, హాస్టల్‌లో అమ్మాయిలు. అందరూ షాపింగ్‌కి వచ్చే చక్కని శనివారం సాయంత్రం. జీతం అందుకున్నాక, చేతినిండా డబ్బున్నప్పుడే. అవసరమైన వాటిల్లో కొన్నైనా కొనుక్కుందామని బజారుకి వచ్చే, సుందరమైన సాయంత్రం.

పెద్ద పెద్ద హ్యాండ్‌బ్యాగ్‌లు చేతులకు తగిలించుకుని చకచక నడుస్తూ, ఫ్యాన్సీ షాపుల్లోకి, బట్టల దుకాణాల్లోకి వెళ్ళిపోతున్నారు. క్వాలిటీలోకి, అప్సరలోకి వెడుతూ వస్తున్నారు.

ఎక్కువగా శనివారం సాయంత్రం ఆ బజారుకి వచ్చే వ్యక్తుల్లో నలుగురు ఆడవాళ్లు. చిట్టిబాబుకు బాగా గుర్తు. అందులో ఓకావిడ సన్నగా తెల్లగా సన్నజాజి మొగ్గలాగ వుంటుంది. ఎప్పుడూ తెల్లటి బట్టలే కడుతుంది. తక్కువ వాళ్ళు రంగుల చీరెలు కట్టి పెద్ద పెద్ద పర్సులు పుచ్చుకొని విలాసంగా నడుస్తూ వుంటారు. తెల్లచీరావిడ ఎప్పుడూ తెల్లటి రాళ్ళ దుద్దులు, ముత్యాల దండలూ వేసుకుంటుంది. ఆవిడ చాలా ధనవంతురాలనీ జమీందార్ల బిడ్డ అయివుంటుందనీ, సినిమాల్లో రాజకుమారిలా వుంటుందనీ అనుకుంటాడు చిట్టి

బాబు. ఆవిడ చేతిలో ఎప్పుడూ తెల్లటి పూసల పర్సు వుంటుంది. ఆ పర్సులో కనీసం వెయ్యి రూపాయలైనా వుంటా యని చిట్టిబాబు అంచనా —

ఓసారి శనివారం వాళ్ళంతా దశపల్ల చిత్రాలయకి సినిమా కొచ్చారు. ఆ సినిమా విడుదలై అప్పటికి రెండే రెండు రోజులైంది. ఆ రోజు సావిత్రి మంచి మూడ్‌లో వుండి "వొరేయ్ చిట్టిగా ఈ పూటసినిమా కెళ్ళిరారా !—" అని తన మొహాన రెండ్రూపాయల కాగితం గిరాటేసింది.

అది పుచ్చుకుని హుషారుగా ఈల వేసుకుంటూ బయలుదేరాడు. ఇంటి కెప్పుడప్పుడూ అతిథులొస్తూ వుంటారు. అతిథు లొచ్చినప్పుడు చంద్రం మావతో పాటు సావిత్రి కూడా ఓ సుక్కేసుకుంటుందని సూర్యం గాడం టాడు. వాడు గురువుగారి నడిగి పదిపైస లుచ్చుకుని అప్పు డప్పుడూ ఓ బీడీ ముక్క కాలుస్తాడు.

చిట్టిగాడు ఆ మద్దెనెప్పుడో ఒకసారి సిగరెట్టు కాల్చాడు గానీ వాడు చచ్చినా బీడీ కాల్చడు. అదంటేవాడికి పరమ అసహ్యం. సరే! ఆ రోజు అతిథు లొచ్చారని కామోసు సావిత్రి తనని సినిమాకి పొమ్మంది. అతిథులొస్తే తనూ, సూర్యం ఇంట్లో వుండకూడదు. అతిథులంటే ఎవరో చిట్టి బాబు కింకా తెలియలేదు గానీ చంద్రం మావ భాషలో మాత్రం కొందర్ని అతిథులనాలని గ్రహించాడు.

అతిథులు వెళ్ళాక మర్నాడూ, ఆ మర్నాడూ సావిత్రి చాలా హుషారుగా వుంటుంది. క్రొత్త చీరో, పూలదండో పూసల గొలుసో ఏదో కొంటుంది, సినిమాకన్నా వెడు

తుంది. మరి, అతిథులంటే సావిత్రి చుట్టాలు కామోసు. అయినా అదంతా ఇప్పుడు మనకక్కర్లేదు. రెండు రూపాయ లిచ్చి సినిమా చూడమంది.

తెల్ల చీర కట్టిన, ముత్యాల గొలుసు వేసుకున్న, తెల్ల పూసలపర్సు పట్టుకున్న రాజకుమారీ, ఆమె స్నేహ బృందం సినిమా హాల్లోకి వెళ్ళి, వాళ్ళకి రిజర్వ్ చేయబడిన సీట్లల్లో దర్జాగా కూర్చున్నారు.

చిట్టిగాడికి తను వేసుకున్న బట్టలు ఎలాంటివో గుర్తు వచ్చింది.

ఆ బట్టలు తను బయటికి వెళ్ళినప్పుడు మాత్రమే వాడాలి. మళ్ళీ వాటిని జాగ్రత్తగా సావిత్రికి అప్పగించాలి. ఇంట్లో వున్నప్పుడు మాసిపోయిన నీలంరంగు నిక్కరూ, వెలిసి పోయిన ఎర్ర-చొక్కా బయటికి వెళ్ళి వొట్టి చేతుల్తో వచ్చిన నాడు యక్షప్రశ్నలూ, మొట్టికాయలూ, ఒక్కొక్కనాడు తిండి కూడా వుండదు. మొదట్లో చంద్రం మావ చాలా మంచివాడనిపించింది గానీ. క్రమేపీ 'పెపంచం' ఎలా అర్థం అయిందో చంద్రం మావ కూడా అలాగే అర్థం అయ్యాడు.

చంద్రం మావ తనని ఎందుకు ఇసాపట్నం తీసు కొచ్చాడో అర్థం అవుతోంది.

ఆరోజు అమ్మతో "ఎన్ని మాటల్చెప్పాడు! అమ్మెలా గుందో! పాపం అమ్మ!"

అమ్మని తల్చుకోగానే చిట్టిగాడి గుండె బరువైంది. ఇక అడుగు ముందుకి పడలేదు. కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. ధాధాపు ఎనిమిది నెలలైంది అమ్మని చూసి.

ధైర్యం కూడదీసుకుని సావిత్రిచ్చిన రెండు రూపాయలకి తన దగ్గరున్న కాస్త డబ్బూ చేర్చి తెల్లటి రాజకుమారి కూర్చున్న చోట కాస్త వెనగ్గా చోటు సంపాదించాడు.

సూర్యంగాడికి తల్లీ, తండ్రీ ఇద్దరూ లేరు.

ఎవరికి పుట్టాడో, ఎట్లా బ్రతికాడో, ఎవరు పెంచారో వాడికే తెలీదు - ఊహ తెలిసిన నాటినుంచీ పేవ్‌మెంట్ల మీదా, ప్లాట్‌ఫారాలమీదా తిరిగాడు. చేయి జాపి తిండి అడగడం ఆకలే నేర్పింది — ఛీదరింపులకి బాధ పడ్డంఅంటే ఏమిటో తెలీదు -- ఎవరైనా ఏదైనా ఇస్తే తినడం, తల దురద పుడితే గోక్కోడం, ఒళ్లు దురద పుడితే ఏ మున్సిపాలిటి పంపు దగ్గరో స్నానం చేయడం-- ఏ అమ్మో దయ దలచి ఓ చినిగిపోయిన చొక్కా --స్టీలుగిన్నెల వాడు కూడా పనికిరాదని పారేసినది - దానం చేస్తే, అది వొంటికి తగిలించుకొని, ఎప్పుడు ఎక్కడ నిద్రవస్తే అక్కడ నిద్రపోవడం అది మాత్రం జ్ఞాపకం వుంది వాడికి.

అలాంటి సూర్యాన్ని చంద్రం మావ దగ్గరకు తీసుకుని బూట్ పాలిష్ నేర్పించాడు. బూట్ పాలిష్ ఒక్కటే జీవనాధారం కాదు. కానేరదు అని బోధించి, దానికి తోడుగా, ఏది ఎప్పుడు ఎలా అందుబాటులోకి వస్తే, దాన్ని అప్పుడు వెంటనే గప్ చుప్ చేసెయ్యడం కూడా నేర్పాడు. అయితే దాని వలన సూర్యానికి వొరిగిందేం లేదు -- రెండు పూట్లా ఇంత తిండి తప్ప. అది కూడా సావిత్రి దయ.

సూర్యాన్ని చూస్తే జాలి చిట్టిబాబుకి. అప్పుడప్పుడూ దొంగతనంగా వేరుసెనక్కాయలూ, మిరపకాయ బజ్జీలు

కోసుక్కు తినడం, తలకి కొబ్బరినూనె రాసుకోడం, సబ్బుతో ఒళ్లు రుద్దుకోడం— యివన్నీ సూర్యానికి చిట్టిబాబు నేర్పాడు.

తెరమీద దృష్టి నిలబడ్డం లేదు. చిట్టిబాబుకి పదే పదే తల్లి జ్ఞాపకం వస్తుంది.

ఎన్నోసార్లు తనకి బుద్ధిగా చదువుకోమని చెప్పింది. బాగా బ్రతకమని చెప్పింది. కానీ— తనిక్కడెలా బ్రతుకుతున్నాడో, ఏం చేస్తున్నాడో ఆవిడకి తెలిస్తే భరించగలదా? గుండె ఆగిపోయి చచ్చిపోతుంది. తను చాలా డబ్బులు సంపాదించాడు. కనీసం ఒక్క పది రూపాయలన్నా అమ్మకి పంపలేకపోయాడు. ఎందుకు పంపలేకపోయాడు?

వచ్చింది వచ్చినట్లు గురువుగారికి ముడుపు చెల్లిస్తున్నాడు.

దెబ్బలకి తెగించి, సాహసించి, ఎంతో కష్టపడి తను డబ్బు సంపాదిస్తే, చుక్కేసుకుని, సావిత్రితో కలిసి తందనాలు త్రొక్కుతాడు. ఈ అన్యాయం నచ్చలేదు చిట్టిబాబుకి.

అసలు తనెందుకు గురువుగారికి భయపడాలి. తనేం చేస్తున్నాడో, ఎంత సంపాయించాడో, అయనకేం తెలుసునని తను నిజం చెప్పాలి?

తెల్లపూసల పర్సు రాజకుమారి సినిమా చూస్తూ కళ్లు తుడుచుకుంటోంది. పూసల పర్సుని వొళ్లో పెట్టుకుని.

ఆ పర్సులో వెయ్యి రూపాయలుంటాయి— ఆవిడ తెల్లచీరెకున్న జరీ అంచు, ఆవిడ చెవులకున్న రవల దుద్దు

ధగధగ, ఆవిడ మెళ్ళో మంచి ముత్యాలదండ - తప్పకుండా ఆవిడ పర్సులో చాలా డబ్బుంటుంది.

తనకి ఉత్తరం రాయడం చేతనౌను — మనీఆర్డరు కట్టడం నేర్చుకోవాలి. బస్కీలు తీసే అప్పన్న నడిగితే నేర్పుతాడు. వాడు మంచివాడే పాపం.

సినిమా వొదిలారు -- "జనగణమన" వేస్తే నిల బడాల్సి వస్తుందనే బాధతో చాలామంది అది వేయకముందే లేచిపోతారని చిట్టిబాబుకి తెలుసు. అందుకే తెల్ల రాజకుమారి కన్న ముందే లేచి గుమ్మం దగ్గర నిలబడ్డాడు చిట్టిబాబు. రాజ కుమారీ, ఆమె స్నేహబృందం ఆఖరి సీను అయిపోతుండగా లేచారు. చాలామంది లేచారు. గేటుదగ్గర గుంపు చేరారు. గుంపులోనుంచీ బయటపడి, సైకిల్ తీసుకుని బయటపడ్డాడు చిట్టిబాబు. వాడి గుండె చాలా వేగంగా కొట్టుకుంటోంది.

తను సరాసరి ఇంటికి వెళ్ళకూడదు --- ముందు ఎక్కడికైనా వెళ్లి లెక్క సరి చూడాలి--- అందులో సగ మైనా కనీసం అమ్మకి పంపించాలి--- పాపం - అమ్మ -- తన దగ్గర్నుంచి ఉత్తరం రాలేదని కంగారు పడుతూ వుంటుంది. ఏడుస్తూ వుంటుంది-- ఆమెని ఎవరు సముదాయిస్తారు? "మొఖం మచ్చల ముండ" అని ఎగతాళి చేస్తారు --- "పగలు చూస్తే రాత్రి కల్లోకొస్తుంది, అని ఈసడిస్తారు. ఇవన్నీ ఎందుకు సహిస్తోంది అమ్మ ఎందుకు బ్రతుకుతోంది?

అయ్య వస్తాడనే ఆశతోనా, తను పెద్దవాడయి ఆమెను సుఖపెడతాడనే ఆశతోనా!

ఎమైనా తనిప్పుడు ఇంటిదోవ పట్టకూడదు. కంచెర

పాలెంలో, పోర్టు క్వార్టర్సులో జాన్ డేవిడ్ వున్నాడు. వాడు తన కెలాగో స్నేహం అయ్యాడు. జాన్ డేవిడ్ దగ్గర డబ్బు దాచాలి- వాడు ఎనిమిది క్లాసులు చదివాడు. అమ్మ ఎడ్రసు చెబితే డబ్బు మనిఆర్డరు చేసేస్తాడు. అమ్మ సంతోషిస్తుంది. పాపం. ఒంట్లో బాగుండదు. తింటు న్నదో లేదో !

కంచరపాలెం వైపు సైకిల్ సాగింది. చిట్టిబాబుకి కళ్లనిండా అమ్మే వున్నది. మనస్సునిండా అమ్మే వున్నది.

భుజంమీద బలమైన చెయ్యి పడేసరికి వులిక్కిపడ్డాడు చిట్టిబాబు. ఆలోచనల గొలుసు తెగింది. వెనక్కి తిరిగి చూశాడు. వాడు సాక్షాత్తూ అప్పన్న.

బస్కీలు తీసీ, కసరత్తులు చేసీ కండలు పెంచిన అప్పన్న.

"ఏంవోయ్ - దోవ మూర్చావు - ఇంటికి రావేటి!" అన్నాడు ముందు.

ఉలిక్కిపడ్డాడు చిట్టిబాబు. తమాయించుకుని, "ఇయ్యాళ ఇంటికాడ అతిథులున్నారుగా - కాస్సేపట్టా సల్లగాలికి తిరిగొద్దామని బయల్దేరానంతే" అన్నాడు.

"అప్పుడే ఇసాపట్నం గాలి సోకేసినాది గుంటడికి - ఎవరికి సెపుతావోయ్ ఎదవ కవురు-పద-పద-నోర్మూసుకుని ఇంటికి పద -" మెడమీద చెయ్యివేశాడు. అది చెయ్యో, ఇనప గుండో అర్థం కావడంలేదు - ఊపిరాడడంలేదు-

"వస్తానులేవోయ్ - రాళ ఎక్కడికి పోతానేమిటీ!" అన్నాడు. చిట్టిబాబు ధైర్యం కూడదీసుకుని.

"మరి దారి ఎందుకు మార్చినావు-ఇంటికేల రావు-?"

వాడి కళ్ళు చూస్తే భయంవేసింది-

"చెప్పానుగా సల్లగాలి కోసమని"

"ఓహో - గుంట ఎదవకి అప్పుడే సల్లగాలి కావాలంట - పిల్లగాలి వొద్దేటి! ఇంతకీ ఇయాళ ఏం కొట్టేసినావేటి?"

"రోజూ ఏం దొరుకుద్ది అప్పన్నా! ఇయాళ సావిత్రి సినిమాకి పొమ్మంది - సూసొస్తున్నాను - అంతే - దసపల్ల హాలులో —"

"నమ్మమంటావేటి!"

"నే నెప్పుడైనా అబద్ధం ఆడానా?"

"ఇంతకు ముందు ఆడినావుకావు - మరి ఇయ్యాళ ఆడుతున్నావు - అప్పన్నంటే ఏటో అనుకుంటున్నావు - నా సంగతి ఇంకా ఎరికలేదు నీకు?

మెడమీద వాడి చెయ్యి బిగుసుకుంటోంది.

"ఇంటికి పోదాంపద అప్పన్న - చంద్రంమావ ఇంకా రాలేదేమని ఎదురు చూస్తుంటాడు."

"ఓహో-హో! మావట మావ! ఎవడ్రా నీకు మావ సంద్రం నీకు మావా! నేను కానా మావని! ముందు ఏం సంపాయించినావో సెప్పు. లేకపోతే ఇయాల నీ రగతం కళ్లజూతాను. జులాయి ఎదవా, నాకాడంట్రా నీ మోసం!"

"నా దగ్గ రేంలేదు. నిజంగా !" బిక్క మొహం వేశాడు చిట్టిబాబు.

వాడి గూబ గుయ్ మంది ఒక చేత్తో చెంప తడుము కుంటూ రెండో చేత్తో కళ్లు తుడుచుకున్నాడు.

అప్పన్న వాడి జేబులన్నీ తడిమి తడిమి చూశాడు. వాడు తొడుక్కున్న చారల ప్యాంటు జేబులో దొరికింది తెల్లపూసల పర్సు.

అప్పన్న చిట్టిబాబు వంక అసహ్యం చిందించే చూ పొకటి విసిరి–

"అబద్ధం ఆడడంట. హరిశ్చంద్రుడే సాచ్చాత్తూ" అన్నాడు.

ఆ పర్సు అప్పన్న చేతిలో వుంటే, తన గుండె వాడి చేతిలో వున్నట్లూ, ఒక్క నిమిషంలో ఆ గుండెని వాడు పిడికిట్లో పెట్టి నలిపివేస్తున్నట్టూ, తన ప్రాణం గిలగిల్లాడి పోతున్నట్టూ బాధపడ్డాడు చిట్టిబాబు.

పర్సుకున్న జిప్పు లాగాడు.

అందులో ఓ నీలం రంగు కాగితం, ఓ చిన్న ఫొటో క్రింద పడ్డాయి. నాలుగు పది రూపాయల నోట్లూ, ఏడో ఎనిమిదో రూపాయలూ – కొంచెం చిల్లరా వున్నాయి. ఫొటోలో అతనికి గుబురుమీసాలూ, చెంపనిండా వెంట్రు కలూ వున్నాయి.

ఉత్తరం కూడబలుక్కు చదివాడు — అదొక ప్రేమ లేఖ — తెల్ల రాజకుమారి పేరు అరుణ. అరుణ సన్నజాజి పువ్వులా వుంటుందట. అందుకోసం ఆమె ఎప్పుడూ తెల్ల

డ్రెస్సులోనే వుంటే బావుంటుందట. త్వరలో చదువుపూర్తి చేసుకుని తను వస్తాడట. అప్పటికి అరుణ ఇంకా అందంగా ఉండాలట.

రాజకుమారికి నలభై రూపాయలు లెక్కలోనివి కావు. కానీ ఉత్తరమో పాపం చిట్టిగాడు చాలా సినిమాలు చూసి వుండటం చేత, వాడికి ప్రేమించుకోడం, ప్రేమలేఖలు వ్రాసుకోడంఅంటే ఏమిటో తెలుసు. ప్రేమలేఖ పారేసుకున్న రాజకుమార్తె అరుణ ఆ రోజంతా అన్నం తినదు ఏడుస్తుంది. అలా ఏడ్చి ఏడ్చి మంచం పట్టి చచ్చిపోతుంది కాబోలు! అమ్మ కూడా తన దగ్గర్నుంచి ఉత్తరం రాలేదని ఏడ్చి ఏడ్చి మంచం పట్టిందేమో! చచ్చిపోయిందా? ఉలిక్కిపడ్డాడు చిట్టిబాబు.

"నాలుగు రోజులాయె సుక్కేసుకొని -- రూపాయి మ్మంటే ఏడ్సేత్తాడు -- వల్లా ఆణ్ణి పొద్దస్తమానూ కాపలా కాయాలా -- దొంగ లంజకొడుకు - కూసాని తినడం మరిగి నాడు" తుపుక్కున వుమ్మేశాడు అప్పన్న---

వాడు ఎవర్ని గురించి మాట్లాడుతున్నాడో చిట్టిబాబుకి అర్థం కాలేదు. పది రూపాయల కాగితాలు రెండు తీసుకుని జేబులో దోపుకున్నాడు ఆత్రంగా. తక్కినవన్నీ పర్సులో కుక్కేశాడు. పర్సు చిట్టిబాబు ప్యాంటు జేబులో తోసి.

"తీసుకోరా దొంగెదవా. పట్టిగెళ్ళి నీ మావ కిచ్చుకో. ఆడి కాళ్ళట్టుకో. ఈ మాటగాని ఆడి సెవినేశావా, నీ వొంట్లో ఎముకలుండవు" చెవి మెలిపెట్టాడు.

"ఒద్దు అప్పన్నా — చెప్పను -- నేనేం చెప్పను. వొదులు" అని పెద్దగా ఏడ్చాడు చిట్టిబాబు.

"బుద్ధిగా మసలుకున్నావంటే నువ్వడిగిన సాయం సేత్తాను. ఎదురు తిరిగావో మెక్కలిరుగుతయ్" చెవి వొది లేశాడు.

"పద పోదాం." వెక్కుతూ అన్నాడు చిట్టిబాబు.

"ఆగాగు. ఓ సుక్క సుకొనొస్తా, పోనీ నువ్వొడతా వేటి!"

"ఇద్దరం కలిసే పోదాం."

"ఓ సుక్కసుకుంటావేటి!" కన్ను గీటి నవ్వాడు అప్పన్న.

"నా కొద్దులే నువ్వు త్వరగా కానిచ్చి వొచ్చెయ్."

"అలాగ దారికొచ్చినావు -- సాలా బాగున్నాది." కూనిరాగం తీస్తూ ప్రభుత్వ సారాయి దుకాణంలోకి వెళ్ళి పోయాడు అప్పన్న -- బయట రోడ్డుమీాద సైకిల్ నానుకుని నిలబడ్డ చిట్టిబాబుకి కడుపులోనుంచి దుఃఖం తెరలు తెర లుగా ఉబికి వస్తున్నది. తను తెల్ల రాజకుమారికి చాలా అన్యాయం చేశాడు. అమ్మకి కూడా అన్యాయం చేశాడు. తను చంద్రం మావతో వచ్చి వుండకూడదు.

చంద్రం మావ అమ్మ కెన్నో ఆశలు కల్పించాడు— తనకీ ఏన్నో చెప్పాడు. తీరా చేసి తనని ఇలా ఉపయోగించు కుంటున్నాడు. ఇక తన బ్రతు కిలాగే గడిచిపోవాలి కాబోలు. అసలు తను కష్టపడీ, ఇతరులను బాధపెట్టీ సంపాయించిన డబ్బు వీళ్ళ మొహాన పొయ్యడం ఎందుకు? ఇకనుంచీ పైస

కూడా ఇవ్వకూడదు -- వీళ్ళ కంట పడకూడదు. అంతే! అప్పన్న వచ్చాడు. వాడి దగ్గర ఒక మంచి గుణం వుంది. వొళ్ళు మర్చిపోయేలా తాగడు. అలా తాగితే గురువు గారికి సంజాయిషీ యివ్వాలని వాడికి భయం.

"చిట్టీ! నువ్వు శాన మంచోడివిరా! అసలు ఇట్టాంటి సోట వుండాల్సినోడివి కానేకావు. కానేటి సేద్దాం - భగవంతుడికి బుద్ధి లేదురా" వీపు చరిచాడు-

"నాను తీస్కున్న డబ్బుల మాట నీ మావకు సెప్పకేం - ఆడసలే సన్నాసి ఎదవ—" అన్నాడు.

"అలాగే" అన్నాడు చిట్టిబాబు--

"ఆ రాత్రికి చిట్టిబాబుకి నిద్ర పట్టలేదు - పర్సు చూసి సావిత్రి ముచ్చటపడింది -- ఉత్తరం చూసి నవ్వి చింపి పారేశాడు చంద్రం మావ.

ఆ ఉత్తరాన్ని చంద్రం మావ అలాగ చింపి పారేస్తూ వుంటే గిజగిజ లాడిపోయాడు చిట్టిబాబు. ఆ రాత్రి కలత నిద్రలో ఎన్నోసార్లు రాజకుమారి కలలో కొచ్చింది. అమ్మ కూడా కలలో కన్పించింది. రాజకుమారి ఏడుస్తూ, అమ్మ ఏడుస్తూ. అవతల గదిలో సావిత్రీ, చంద్రం మావా ఒకటే వికవికలు. ఆ యింటికి మకుటం లేని మహారాజూ - మహారాణీ!

వరండాలో కాళ్ళు డొక్కలో దూర్చుకుని పడుకున్న కావలి కుక్క- సూర్యం.

వాడికి కొంచెం ఎడంగా నులకమంచం మీద అంగరక్షకుడు అప్పన్న. పాత మడత మంచంమీద తను.

ఆ ఇంట్లో ఇక వుండకూడదని గట్టి నిర్ణయం చేసుకున్నాడు చిట్టిబాబు.

తను ఎలాగో కష్టపడి రెండుమూడొందలు కూడబెట్టుకుని గుంటూరు వెళ్ళిపోవాలి. అమ్మని చూడాలి.

ఇకనుంచీ అక్కడే ఐస్‌ఫ్రూట్‌లు అమ్ముకునో, ఏ కొట్లోనైనా పని కుర్రవాడిగా చేరో బుద్ధిగా బ్రతకాలి. అందుకని ఇకనుంచీ తను దొరికిందంతా చంద్రం మావ కివ్వకూడదు. జాన్ డేవిడ్ దగ్గర దాచాలి -- జాన్ డేవిడ్ కుటుంబాన్ని తలుచుకుంటే ముచ్చటగా వుంటుంది చిట్టిబాబుకి - వాళ్ళ నాన్న హెన్రీడేవిడ్‌కి పోర్టులో ఉద్యోగం -- వాళ్ళమ్మ ఎమీలియాకి స్కూల్లో టీచరు పని- ఇల్లంతా చక్కగా దిద్దినట్లు వుంచుతారు. ఏసుక్రీస్తంటే భక్తి. ఎంతో దయగా ప్రేమగా మాట్లాడుతారు. ఎమీలియాని చూస్తూ వుంటే రాజమ్మ జ్ఞాపకం వస్తుంది చిట్టిబాబుకి. మొహం మీద మచ్చలు పుట్టక ముందు వుండే రాజమ్మ.

ఒక రోజు జాన్ డేవిడ్ - వాడి వయస్సు పన్నెండేళ్లు - మందులు కొనడానికి బజారుకి వచ్చాడు. అతడి పర్సు చిట్టిబాబుకి చిక్కింది - అలవాటుగా వెళ్ళి కిళ్ళీకొట్టు దగ్గర నిలబడి సినిమా పత్రిక చాలా సీరియస్‌గా చదివేస్తున్నాడు చిట్టిబాబు - డేవిడ్ ఏడుస్తూ అటు వస్తున్నాడు. వాడి ఏడుపు చూస్తే జాలేసింది చిట్టిబాబుకి.

"మా అమ్మకి జ్వరం వచ్చింది. మందు కొందామని బజారుకి వచ్చాను - పర్సు పోయింది. ఇప్పుడెలాగ!" అని ఏడుస్తున్నాడు డేవిడ్.

ఆ పిల్లవాడి పర్సు తీసినందుకు బాధనిపించింది చిట్టి బాబుకి. సైకిల్‌మీద వాడి వెనకాలే కొంత దూరం వెళ్ళి, అక్కడ రోడ్డుమీద జనం లేకుండా చూసి, "ఇదిగో నీ పర్స్" అని వాడిమీదకి విసిరేశాడు—

డేవిడ్ కళ్ళు కృతజ్ఞతతో వెలిగిపోయాయి.

"థాంక్స్" అని పదిసార్లు చెప్పాడు— ఇంటికి తీసుకు పోయి, టిఫిన్ పెట్టించాడు - అప్పటినుంచీ ఇద్దరికీ స్నేహం. తన సంగతి డేవిడ్‌కి తెలీదు - తెలిస్తే తనతో స్నేహం చెయ్యడు. అందుకనే తను చెప్పలేదు.

ఆలోచనలు ఒక నిర్ణయం దగ్గర ఆగిన తరువాత కొద్దిగా నిద్రపట్టింది చిట్టిబాబుకి.

ఆ తరువాత నాలుగు రోజుల వరకూ చిట్టిబాబుకి గిరాకీలేం తగల్లేదు. ఈ లోపున అప్పన్న ఐదు రూపాయ లడిగితే లేవన్నాడు. వాడికి ఎప్పటి కప్పుడు పరగడుపూ, పాచి మొహమూనూ!

ఐదో రోజు సాయంత్రం జగదాంబ సినిమా హాలు దగ్గర వాడికి దొరికిన పాము కుబుసంతో చేసిన మెత్తని పర్సులో వంద రూపాయ లున్నాయి. తన వెంట సూర్యం కానీ, అప్పన్న కానీ ఎవరూ లేరు. అందుకోసం సైకిల్ మీద డేవిడ్ ఇంటికి బయలుదేరాడు. పర్సు దోవలో గిరా టేసి వంద రూపాయలు ప్యాంటు జేబులో కుక్కుకున్నాడు. డేవిడ్ దగ్గర డబ్బు దాచి ఇంటికి వచ్చి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

తరువాత రోజు పూర్ణా మార్కెట్ దగ్గర ఓ

హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి అతి నేర్పుగా నాలుగు పదిరూపా యల కాగితాలు తీసి అటుకేసి బయల్దేరాడు. అప్పుడు సాయంత్రం ఆరు గంటలైంది.

ఇంకొక్క అర్థ్వై రూపాయలు సంపాదిస్తే ఇంటికి వెళ్ళిపోవొచ్చు.

"ఏం ఇటు బయల్దేరావ్!" ఉలిక్కిపడ్డాడు చిట్టిబాబు – చంద్రం! తను గుర్తు పట్టనేలేదు. బెల్‌బాటమ్ ప్యాంటు సిల్కుభూ చొక్కా. ఎత్తుగావున్న బూట్లూ — యూనివ ర్సిటీలో చదివే అబ్బాయిలాగ వున్నాడు.

చంద్రం మావని చూడగానే హడలిపోయాడు చిట్టి బాబు.

"మొన్నా మద్దిన కూడా ఇటుకేసి వెళ్ళడం చూశాను. ఏం ఎక్కడ దాస్తున్నావు డబ్బు?"

"నేను ఎక్కడా దాచడం లేదు–"

"వొళ్లు దగ్గరుంచుకో బికారి వెధవా!"

చెంప ఛెళ్లు మంది.

"నువ్వు నలభై రూపాయలు తియ్యడం చూశ్ళేదను కున్నావేంట్రా!"

గుడ్లు మిటకరించాడు చిట్టిబాబు.

"ఇలా పడెయ్ – సన్నాసి–"

తీసిచ్చాడు — చేతులు జోడించాడు.

"ఖబడ్దార్ – నేనంటే ఇంకా తెలిసినట్టు లేదు."

"ఇయ్యాళ ఈ వెధవకి కూడెట్టమాక" అన్నాడు ఇంటికొచ్చాక సావిత్రితో.

"చిన్న యెదవలకి పెద్ద సిచ్చ లేస్తానంటావ్. ఇయాళ కూడు తినకపోతే- రేపు పనేం సేత్తాడేంటి! కోపవొస్తే కూకలెయ్యి. తిండి పెట్టకపోతే ఆకలికి మాడి సావడేటి" అన్నది సావిత్రి సానుభూతిగా.

"నువ్వూర్కో- నీకేటీ తెలీదు" విసుక్కున్నాడు వీరాస్వామి.

"నీకసలేటీ తెలీదు. రారా చిట్టీ! నీకు బువ్వ నేనెట్టుకుంటా. నిన్ను సూత్తే నా కడుపు తరుక్కుపోతది గదరా - నా సొంత తమ్ముళ్లాగుంటవు-" అని చిట్టిగాడిని లాక్కుపోయి అన్నం పెట్టింది.

"లౌక్యం ఎరగవు సెంద్రం నువ్వు — అట్టా కోప్పడితే ఆడికి నీ మీద గురి కాస్త పోతది - రేపో ఎల్లుండో సెప్పకుండా ఎల్లిపోతాడు - అందుకని సూసీ సూడనట్టుండాల. ఆడొచ్చినాక నీకెంత నాబవొచ్చినాదో ఆలోసించావా!" అని రహస్యంగా చీవాట్లు పెట్టింది చంద్రాన్ని -

డబ్బుపోయి శనిపట్టిందనుకుంటే ఏడుపొచ్చింది. కానీ పైకి ఏడవకూడదు మరి!

దానికి తగ్గట్టు రెండు చొక్కాలు కుట్టించగానే వుబ్బి తబ్బిబ్బైపోయిన సూర్యంగాడు, "ఈ మద్దిన సిట్టిగాడు మారిపోయాడు గురూ. ఆడికెప్పుడూ ఒకటే ఆలోసన ఇంటికి పోవాలని. ఆడు ఎవురో సేవితులకాడ డబ్బు దాస్తున్నానని చెప్పాడు. నీతోడు గురో! ఎప్పుడు లేసెల్లిపోతాడో గురో!"

అని చెప్పేశాడు. చొక్కాలవంక సంబరంగా చూసుకుంటూ— "రాస్కెల్, వాడికి పాఠం చెప్పాలి," అని కళ్ళెర్రజేశాడు గురువుగారు.

ఆదివారం సాయంత్రం రామకృష్ణా బీచ్‌కి చాలా మంది వచ్చారు. వచ్చిన వాళ్ళల్లో విదేశీయులు కూడా వున్నారు. వాళ్ళ మెడల్లో కెమేరాలు, చేతులకి ఖరీదైన రిస్టువాచీలు.

అశాంతిగా బీచిలో పచార్లుచేశాడు చిట్టిబాబు - కొంచెం చీకటిపడాలి - ఇంత వెలుగు పనికిరాదు, ఓ చోట కూర్చుని వార పత్రిక చదువుతున్నట్టు అభినయించాడు. వాడికి పత్రికలోది ఏదీ అర్థంకాదు. కూడబలుక్కుని సినిమా వార్తలు చదివాడు. ఫలానా సినిమాలో ఫలానా తార ద్విపాత్రాభినయం అంటే రెండు వేషాలు - డబుల్‌ఫోజ్ - చూడాలి! ఫలానా సినిమాలో ఎన్టీ రామారావు కృష్ణుడు, చాలా బావుంటాడు! ఇంకో సినిమాలో నాగేస్రరావు త్రాగుబోతు - ఆడి దుంపతెగ - ఆ యేషానికి నాగేస్రరావు ముందు అందరూ తీసికట్టే - వ్యాఖ్యానం చేసుకుంటూ బొమ్మలు చూశాడు. చీకటిపడింది. చాలామంది వెళ్ళడానికి లేస్తున్నారు. బీచికి వచ్చే ఆడవాళ్ళ దగ్గర ఎక్కువ డబ్బుండదు. ఒక్క షాపింగ్‌కి వస్తేనే ఆడవాళ్ళు డబ్బు తెస్తారు. తక్కిన వేళల్లో తేరు. మగవాళ్ళ పర్సులో ఎప్పుడూ డబ్బుంటుంది.

దొరికింది బరువుగానేవుంది. గుండె దడదడలాడింది. కానీ మరు నిమిషమే. తెల్లటి లాల్చీతొడిగి, జరీ

అంచు పంచె కట్టిన ఆసామి–"అయ్యో, నా పర్సు పోయింది" అని నిప్పుతొక్కిన కోతిలా గంతులు వేశాడు.

వెంటనే ఒక బలమైన చెయ్యి చిట్టిగాడి మెడమీద పడింది.

"దొంగ రాస్కెల్ – వేసేది దొర వేషమూ చేసేది దొంగతనమూ నట్రా !" చెంప ఛెళ్ళుమంది. కళ్లు చీకట్లు కమ్మాయి ఒక్క క్షణం. మరుక్షణంలో తను తీసిన పర్సు ఆ వ్యక్తి చేతిలోనే ఉంది.

అతను! అతను ! చంద్రం మావ !

"చూశారా సార్ – వీడెలాంటి వేషం వేశాడో! ఎలాంటి పనిచేశాడో ? నేను చూశాను గనక సరిపోయింది. జేబుదొంగ లెక్కువై పోయారు – మీరు కాస్త కేర్‌ఫుల్‌గా వుండడం మంచిదని నా సలహా !" – తెచ్చి పెట్టుకున్న స్పష్టతతో వాక్యాలు కూర్చుకుని మాట్లాడుతున్నాడు చంద్రం.

"మావా !" అని ఆశ్చర్యంగా అనబోయి నోరు తెరిచాడు చిట్టిబాబు.

"మళ్ళీ చేస్తావా ఇలాంటి పని !" చెంపమీద ఇంకొకటి ఇస్తూ గట్టిగా అరిచాడు చంద్రం. జనం గుమిగూడారు – పర్సు స్వంతదారుని చేతిలోకి వెళ్ళింది.

అతగాడు చంద్రానికి చాలాసార్లు "థాంక్యూ"లు చెప్పాడు. చిట్టిగాణ్ణి "బ్లడీ – బగ్గర్". "బాస్టర్డ్" అంటూ చాలా చాలా ఇంగ్లీషు తిట్లు తిట్టాడు.

"పోలీసులకి అప్పజెప్పండి సార్ – ఇలాంటి వాళ్ళని వదలిపెట్టకూడదు–" అని గుంపు సలహా యిచ్చింది.

ఎవర్ని విడిచిపెట్టాలో, ఎవర్ని విడిచిపెట్టకూడదో, ఎవర్ని పోలీసులకి అప్పగించాలో, ఎవర్ని అక్కర్లేదో అన్నీ చంద్రానికి బాగా తెలుసు కనుక, చిట్టిగాడి వీపుమీదా, చెంపలమీద ఫెడీ ఫెడీమని దెబ్బలువేసి, కాలరు పుచ్చుకుని అటూ ఇటూ వూపి "వెళ్ళు! దొంగ వెధవా! ఈసా రెప్పుడైనా ఇలా కనిపించావో పోలీసులకి అప్పగిస్తాను. కావాలంటే 'అమ్మా బాబూ' అని అడుక్కుని బ్రతుకు. ఈ వెధవ పని మాత్రం చెయ్యకు" అని విడిచిపెట్టాడు.

ఇన్ని దెబ్బలు తిన్న చిట్టిగాడికి చంద్రాన్ని "మావా!" అని పిలిచే ధైర్యం లేకపోయింది.

ఇదంతా చంద్రం ఎందుకు చేశాడో చిట్టిగాడికి అర్థం అయింది. తానీమధ్య డబ్బు దాచుకోడానికి ప్రయత్నం చేస్తున్నాడని సూర్యం చెబితే - తనకు బాగా శాస్తి చేయాలని ఇలా చేశాడు. ఇంక తను చచ్చినా ఇక్కడుండకూడదు- వెళ్ళిపోవాలి డబ్బుతెచ్చి వాడి మొహాన పడేయడం, తను దెబ్బలూ, తిట్లూ తినడం. ఇదేం బాగాలేదు. తన వొంటి మీద తేలిన ఈ వాతలు చూస్తే అమ్మ వుంటే జుత్తు పీక్కుని ఏడ్చేది. పాపం! అమ్మ - వెళ్ళాలి. అమ్మదగ్గరకు వెళ్ళాలి.

వాడికి సూర్యాన్ని చంపుదామన్నంత కోపంవచ్చింది. వాడ్ని చితకతన్నాలి. తనెన్ని దెబ్బలుతిన్నాడో అన్ని దెబ్బలూ వాడ్ని కొట్టాలి. తనకి చిక్కకపోతే అప్పన్న చేతైనా తన్నించాలి. దొంగవెధవ ఎన్నిసార్లో వాడికి తను టీ నీళ్ళకి

డబ్బులిచ్చాడు. ఐస్‌ఫ్రూట్స్, సోడాలు ఇప్పించాడు, సావిత్రికి చెప్పి అన్నంలోకి పచ్చడో, కూరో వేయించేవాడు.

వీళ్ళందరికన్న సావిత్రే మంచిది. దానికి జాలీ, దయా వున్నాయి. తక్కినవాళ్ళంతా రాక్షసి వెధవలు - ఇంటికి వెళ్ళి తను పడుకునే పాత మడతమంచంపైన పడుకున్నాడు చిట్టిబాబు - చెంపలు మండిపోతున్నాయి. వొళ్ళంతా నొప్పులు - అవమానం - కోపంతో కుతకుతలాడిపోతున్నాడు.

తరువాత చంద్రం మావ - కాదు వీరాస్వామి రాక్షసుడు - వచ్చాడు. తూలుతూ పేలుతూ - ఏదో మంచి గిరాకీ తగిలినట్లుంది. బీరు బాగా పుచ్చుకున్నాడు. మంచి వేషంతో బయటికి పోతే బీరు పుచ్చుకుంటాడు. అసలు వేషం వేస్తే ప్రభుత్వ సారాదుకాణంలో నాటుసారా పుచ్చుకుంటాడు.

వస్తూనే "ఏవోయ్ అయిందా పెళ్ళి మరేదా!" అని దీర్ఘంతీశాడు.

చిట్టిబాబుకి ఏడుపొచ్చింది, తమాయించుకున్నాడు.

"పెద్దోడివైపోనా వీమద్దిన - అందుకే సనమానం చేయించినాను. ఇకమీద బుద్ధిగుండు" అన్నాడు.

"కూడు దినవేంట్రా చిట్టీ!" అంటూ బయటికొచ్చింది సావిత్రి.

"నా కొద్దప్పా - ఆకల్లేదు-" అన్నాడు.

"ఆడి కడుపు నిండిపోనాదిలే నువ్వొల్లకుండు, పద - లోపలికి-" అని సావిత్రిని నెట్టుకుపోయాడు చంద్రం మావ.

"సూర్యంగాడు బిక్కు బిక్కు మంటూ వెళ్ళి వాదిగి

వొదిగి పడుకున్నాడు ఓ మూల. వాడి వంక ఎర్రటి మండే కళ్ళతో చూసి పళ్ళు కొరుకుతూ, "బద్మాష్ వెధవా, రేపు చేస్తాను నీ పెళ్లి" అనుకున్నాడు చిట్టిగాడు.

• • •

ఒకటి కాదు, రెండు కాదు. నెలలకి నెలలే గడిచి పోయాయి కొడుకు పట్నంపోయి. ఒక్క కార్డుముక్కైనా రాలేదు. "ఆణ్ణి సూడకపోతే బతగ్గలనా?" అనుకుంది రాజమ్మ.

రాజమ్మకి వొంట్లో బాగుండలేదు. కళ్లు సరిగ్గా కన పడవు. ఎప్పుడూ దిగులుగావుండే రాజమ్మ పని సరిగ్గా చెయ్యలేదు. ఆలోచిస్తూ, గొణుక్కుంటూ, సణుక్కుంటూ గంటసేపు గిన్నెలు తోమితే, ఏ యిల్లాలు భరించగలదు? రాజమ్మకి పాచిపనులైనా కుదరడంలేదు - అడుక్కుని తినడం చేతకావడంలేదు. తన పిచ్చిగానీ, అడుక్కునే వాళ్ళందరి జోలెలూ నిండుతున్నాయా! ఆ జోలెలు ధాన్యంతోనూ, ఆహారంతోనూ కాదు నిండేది. తిట్లతోనూ, ఈసడింపుల తోనూ నిండుతున్నాయి. గుండెలో గుబులు - మస్తాన్మీద దిగులు - చిట్టిగాడిమీద దిగులు - దిగులు ఎక్కువైనప్పుడు గుండె చిక్కబట్టి నట్లుంటుంది. చచ్చిపోతానని భయం. తను బతికేంచేయాలి? కానీ ఒక్కసారి చిట్టిని చూడాలి - ఒక్క సారి చూడాలి. తనకోసం, వాడు ఎంత దిగులుపడ్డాడో రాజమ్మ కీమధ్య తను చచ్చిపోతాననీ, ఆ సమయం దగ్గర

కొచ్చిందని చచ్చిపోయేలోగా చిట్టిగాడిని ఒక్కసారి చూడాలనే తపన ఎక్కువైంది.

"నీ తమ్ముడిపేర ఒక్క కార్డుముక్కరాసి, చిట్టిబాబుని రప్పించు" అని రత్తాలుకి పదే పదే చెప్పింది రాజమ్మ. కాని రత్తాలు వ్రాసిందో లేదో రాజమ్మకి తెలియదు.

ఇసాపట్నం ఎల్లాలంటే డబ్బులుకావాలి. తన దగ్గర రూపాయైనాలేదు. వున్నవాళ్ళంతా అమెరికాలూ, ఇంగ్లాండులూ వెడుతూంటే తనకి "ఇసాపట్నం" పోవడానికే చేత కావడంలేదు. ఎల్లాగైనా వెళ్ళాలి. చస్తే అక్కడే చిట్టిగాడి దగ్గరే చావాలి. రేపటినుంచీ బస్సుస్టాండింగ్ దగ్గరో, బజార్లోనో నిలబడి అడుక్కునైనా డబ్బు పోగుచేయాలి.

అలా అనుకుందేగాని, అర్ధరూపాయి పోగయ్యేసరికి ఆకలి కడుపు తన మాటేమిటని గొడవ చేసేది. నెలనించీ అడుక్కుంటున్నా రాజమ్మ దగ్గర అయిదు రూపాయలు మిగల్లేదు. అయినా ప్రాణాలు ఉగ్గబట్టుకుని విశాఖపట్నం పోవడంకోసం, చిట్టిగాడిని చూడ్డంకోసం బ్రతుకుతోంది – 'మొహం మచ్చల గుడ్డిముండ' అని అందరిచేతా ఈసడించుకోబడే రాజమ్మ.

రాజమ్మ బాధ, రాజమ్మ అవతారం చూసిన రత్తాలు ఒకనాడు వచ్చి "ఇదిగో రాజమ్మా ఇరవైరూపాయలిస్తా – ఇసాపట్నం వెల్లు – కాగితంమీద మా చంద్రం అడ్రసిస్తా తీసికెల్లి వాకబుచెయ్యి – నిన్ను సూస్తావుంటే నా కడుపు చెరువైపోనాది–" అని ఇరవై రూపాయలిచ్చింది.

"నా తల్లే – నా బంగారమే" అని కసువుతీరా కన్నీళ్లు

కార్చి విశాఖపట్నం బయల్దేరింది రాజమ్మ - విశాఖపట్నం అంటే అది తను సినిమాల్లో చూసే పట్నంలాంటి చాలా గొప్ప పట్నమనీ - అక్కడంతా దొరలూ - ధనవంతులూ వుంటారనీ రాజమ్మ ఊహ.

ఆ మహాపట్నంలో వుండి చిట్టిగాడు ఎంత చక్కగా తయారౌతున్నాడో, ఎంత బాగా చదువుకుంటున్నాడో! ఒక్కసారి కళ్ళారా వాణ్ని చూసి, ఆ చంద్రం బాబుకి వాణ్ణి అప్పగించ పెట్టి, తను చచ్చిపోతే దిగులు తీరిపోతుంది.

రత్తాలు యిచ్చిన ఎడ్రసు చూసి వాకబుచేసుకుంటూ కనపడీ కనపడని దృష్టితో కాళ్ళరిగిపోయేలాగ తిరుగుతోంది. ఊరు ఊరంతా ఆక్రమిస్తున్నట్లు అదేమిటో ఆ పెద్ద వంతె నొకటి కనపడుతోంది. సీతమ్మగారింట్లో పని చేసినప్పుడు, ఆమె తనని ఇంట్లో వుంచీ మద్రాసని, హైదరాబాదనీ, గుంటూరనీ, ఆ వూరనీ- ఈ వూరనీ తిరిగొచ్చేది. తనకి ఒక్కసారీ ఏ వూరూ చూపించలేదు - తనని బాగా వినియోగించుకుందే కానీ, తనకేమీ వినియోగపళ్ళేదు.

"గొప్పోళ్ళ యవ్వారాలంతేనే రాజమ్మా - బతక లేక మనం ఆళ్ళ నీడకోసం ఆశపడతాం - మనం చిన్న చిన్న మొక్కలం, మర్రిచెట్ల నీడలో మనం బతగ్గలమా? ఆ సంగతి తెలుసుకోలేక ఆ నీడ కోసం వెంపర్లాడతాం-" అనేవాడు భుజంగం బాబు నౌకరు పోతరాజు.

పోతరాజు బాబాయ్ చాలా మంచివాడు. మరి

భుజంగం బాబు అతణ్ని చెడ్డపనులకు వినియోగించడు. రత్తా లిచ్చిన డబ్బు రైలుచార్జీలకే సరిపోయింది – తిండీ నీళ్ళూ లేని రాజమ్మకి 'ఇసాపట్నం'లో చంద్రంబాబు ఇల్లూ దొరక లేదు. చిట్టిబాబు జాడా కనపళ్లేదు. అంతేకాదు. అక్కడ వాళ్ళు మాట్లాడే భాష ఆమెకి అసలు అర్థం కావడంలేదు.

ఊరు వదిలినా, అడుక్కోవడం తప్పలేదు.

"అలాగ అడుక్కోపోతే, కాయలమ్మ రాదేటి," అనో, "పని చేసుకోకూడదేటి !" అనో కసిరేవాళ్లు.

రాజమ్మ "ఇసాపట్నం" వచ్చి వారం రోజులైనా చిట్టిగాడి అజా- అంబారం ఆమెకేం దొరకలేదు. నిరాశతో పాటు నీరసం కూడా ఎక్కువైంది.

* * *

సూర్యాన్ని కసికొద్దీ తన్నిన తరువాత చంద్రం మావకి చిట్టిగాడిమీద మరీ కోపంగావుంది. ఆ కోపం, చిట్టి గాడు చెయ్యి జారిపోతున్నందుకని సావిత్రి గ్రహించింది. ఆమె శక్తికొలదీ చిట్టిగాడిని సముదాయించి, చంద్రం మావ మంచితనాన్ని గురించి బోధించింది. అతడు చిట్టిగాడికి చెయ్య బోయే సహాయాన్ని గురించి ఆశలు కల్పించింది.

అయినా చిట్టిగాడు లొంగలేదు. వాడికి చాలా కసిగా వుంది. చంద్రం మావ చేసిన అవమానం తలుచుకున్నకొద్దీ బాధగా ఉంది. చంద్రంమీద ఓపలేనంత కోపం వచ్చింది వాడికి; తనింక ఈ విశాఖపట్నంలో, ఈ చంద్రం చేతిక్రింద

చచ్చినా వుండడు. వెళ్ళిపోతాడు. గుంటూరు వెళ్ళిపోయి ఏ కొట్లోనైనా పనిచేసుకు బ్రతుకుతాడు. అయితే వెళ్ళే ముందు కాస్త డబ్బు తీసుకుపోవాలి - లేకపోతే అమ్మ ఏమనుకుంటుంది ? అమ్మని సంతోషపెట్టాలి. మంచి చీర కొనివ్వాలి. సావిత్రి కట్టుకునే లాంటి చక్కని చీర కొనివ్వాలి.

వారం పది రోజులుగా చిట్టిగాడికి గిరాకీలేం లేవు - చిట్టిగాడు కొట్టిన తరువాత సూర్యానికి చాలా మర్యాదలు చేస్తున్నాడు చంద్రం-వాడు చంద్రానికి డేవిడ్ ఇల్లు చూపించాడు. ఇద్దరూ కలిసి డేవిడ్ తల్లికి చిట్టిమీద ఎన్నో చెప్పి, ఆ డబ్బుకాస్తా తెచ్చేశారు. చిట్టి దగ్గరేం లేదిప్పుడు.

వాడికి ఇంటికి వెళ్ళాలని ఎంత ఆరాటంగా వుందో, గిరాకీ అంత తగ్గిపోయింది.

ఆ విసుగులో, ఆరాటంలో, తొందరలో,

మిట్ట మధ్యాహ్నం చిట్టిగాడి మనస్సులో కసికన్న రెండురెట్లు ఎక్కువ కసితో ప్రపంచాన్ని చూస్తున్నాడు సూర్యుడు. ఎక్కడివాళ్ళక్కడ సర్దుకున్నాక సర్దు మణిగిపోయాయి, మాడిపోయిన పెనాల్లాంటి రోడ్లు.

రెండురోజులనుంచీ సరిగ్గా తిండిలేదు. తనెక్కడ తిరిగినా తనవెనక చంద్రం మావ బంట్లు ఎవరో ఒకరు వుంటూనే వున్నారు.

బస్సుస్టాండు దగ్గర నిలబడ్డాడు చిట్టిబాబు, తల మాడిపోతోంది....

లాభంలేదు. ఈ రోజు ఏదో ఒకటి జరగాలి.

బస్ ఒకటి వచ్చింది. అది చాలా దూరంనుంచీ వచ్చినట్లు, అందులోనుంచీ దిగుతున్న ప్రయాణీకుల మొహాలే చెబుతున్నాయి.

చిట్టిబాబు వెళ్ళాడు. రెండు రోజులుగా తిండి లేక పోయినా, వాడు కట్టిన బట్టలు నలగలేదు. వాడి కళ్ళల్లో వెలుగూ, వాడి మొహంలో దర్పం తగ్గలేదు. అందుకోసం వాడిని చూసి ఎవరూ వెనక్కి జంకలేదు. తొక్కిడులూ హడావుడిలూ -

అవును - దొరికింది - హాయ్ దొరికింది -- ఊపి రందడంలేదు. వాయు వేగంగా సైకిల్ తొక్కుకుంటూ చాలా దూరం వచ్చేశాడు. కానీ అంతకన్న ఎక్కువ వేగంగా తనని వెంబడిస్తూన్న చంద్రం మావని వాడు చూడనే లేదు.

"రేయ్. దొంగనాయాలా, ఏదీ తియ్‌రా బయ టికి."

"నా దగ్గరేం లేదు."

"తియ్‌రా భడాచోర్."

తీశాడు. ఒక బంగారపు దిద్దుల జత, వంద రూపా యల చిల్లర, కళ్ళజోడు, బొట్టు పెట్టుకునే పెన్సిల్, పౌడర్, కాటుక, లిప్‌స్టిక్, ఎవరో విశాఖపట్నం వచ్చి కలుసుకో మని వ్రాసి ఇచ్చిన ఉత్తరం, ఎడ్రెస్.

"తిండి లేకపోయినా, పొగరు చావలేదు. నా కళ్లు కప్పడం నీ తరమంట్రా !"

దెబ్బలు తగల్లేదు వాడికి.

"రేపటినుంచీ నువ్వు ఇల్లు కదిల్తే సంపేత్తాను — ఇంటో పడుండు — పదపద."

"సావిత్రీ - వీణ్ణి ఇల్లు కదలనీయమాక - ఇదిగో ఈ దుద్దులజత నీకు బాగుంటదేమో సూడు. లేకపోతే బజార్లో తాకట్టెట్టేస్తా -" అన్నాడు ఇంటికొచ్చాక.

సావిత్రి దాన్ని చూసి సంబరపడింది - అంతేకాదు, - ఆ ఖరీదైన పౌడరూ, లిప్‌స్టిక్కూ - అన్నీ ఆమెకి చాలా నచ్చాయి. పర్సుమాత్రం నీళ్ళ కాగుక్రింద మంట వేసేసింది. ఎందుకంటే దానిమీద మిస్ శారదారాణి, దుగ్గిరాల అని వ్రాసి వుంది. అలాంటివి దగ్గరుంటే చాలా ప్రమాదం "పాపం పిచ్చి శారదారాణి" నవ్వుకుంది సావిత్రి.

ఆ రాత్రి చంద్రం మావ - ఇహనుంచీ వాణ్ణి మావన కూడదు, వాడు తనకేం మావ! "అణ్ణి ఈరాసామిగా డనాలి" -

ఆ ఈరాసామిగాడు సినిమాకెళ్ళాడు- మహా జోరుమీా దున్నాడు. అంతా తెచ్చి చేతికిస్తే అనుభవించడానికి సిగ్గు లేనివాడు.

గదిలో మంచంమీద కళ్లికిలా పడుకొని ఆలోచిస్తు న్నాడు చిట్టిగాడు.

"ఏరా సిట్టిగా - ఏం సేసినా వేటి - మావ కోపమొచ్చినాది -" అంటూ దగ్గరగా వచ్చింది సావిత్రి. చేతిలో మజ్జిగన్నం కలపిన చిన్న కంచం ఒకటి పట్టుకుని -

సావిత్రి, తన్ని బాగా చూస్తుంది - ఎందుకంటే తను తెచ్చే వస్తువులంటే దానికి ప్రాణం గనుక. చిట్టిగాడు సావిత్రికేం జవాబు చెప్పలేదు.

"నీకోసం మజ్జిగన్న మట్టుకొచ్చినాను - కసింత తిను - మా బాబు గదూ?"

"నాకొద్దు" ఏడుపొచ్చింది.

"నిన్ను చూస్తే జాలేస్తది. బహు పెంకి గటానివి సుమా! నా మాటిని ఏంగావాలో తిను."

"నాకే మొద్దు."

సావిత్రి చిట్టిగాడి ప్రక్కన కూర్చుని వాడి తల నిమిరింది.

"అమ్మదగ్గర కెడతావేంటి?" అన్నది.

తల వూపాడు.

"అందుకోసం ఏడవాలేంట్రా సిట్టీ - నీకు డబ్బులిస్తా - ఎల్లు."

చిట్టి కళ్లు మెరిశాయి. కానీ మళ్ళీ సందేహం - సావిత్రి చెప్పేదంతా నిజమా! అబద్ధమా! అని.

"సూడు సిట్టీ - ఈ ఎదవ బతుకన్నా ఈ పాపిట్టి సొమ్మన్నా నేనేం పడిసావను - సాలెగూట్లో ఈగలాగ నేనూ ఈడ సిక్కుకుపోయిన దాన్నే - ఎల్లాలంటే నేను డబ్బిస్తా వెళ్లు - కాని సెంద్రంతో మాత్రం నాను డబ్బిచ్చినా సన మాక - ఎదవ సచ్చినోడు మంచోడు కాడు-"

"అక్కా"! సావిత్రిని కౌగలించుకుని బావురుమన్నాడు. వాడి కడుపులో దాచుకున్న అవమానభారం, దుఃఖం, ఆవేధన ఒక్కమాటు బహిర్గతం అయింది.

"ఈ మాత్తరాని కేడుస్తారంట్రా - ఇదిగో ఈ యాభై రూపాయ లట్టుకుని నేరుగా టేసను కాడికెల్లు - నువ్వొచ్చిన్నాటి నుంచీ నా తమ్ముడ్నాగనో, కొడుకు నాగనో అనుకొంటున్నా. ఎల్లిపోయి కట్టం సేసుకు బతుకు. అన్నం మాత్తరం ఈపూట నా సేతిమీందుగా ఎట్టుకుంటా."

సావిత్రి అన్నం తినిపిస్తూంటే అమ్మ జ్ఞాపకం వస్తున్నది. మనస్సు ఘోష పెడుతున్నది - అమ్మ! అమ్మ! అమ్మ!

రొంటిలో దోపిన డబ్బు తీసి చేతిలో పెట్టి గుప్పెడు మూసింది - బుగ్గ సాగదీసింది. జుత్తు నిమిరింది. అప్పుడామె కళ్ళల్లో కూడా నీళ్ళొచ్చాయి - ఎంతైనా ఆడది ఆడదే!

అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటి బయటికి వచ్చాడు. స్టేషను కేసి నడుస్తున్నాడు. గుండె వేగం

హెచ్చింది. వెళ్ళిపోవాలి - వెళ్ళిపోవాలి – చంద్రం మీావ కంట పడకూడదు.

ఎంత నడిచినా దూరం తరగడంలేదు - అక్కడ ఆ నడిరోడ్డుమీాద జనం గుంపు — అదేమిటో చూద్దామని అక్కడికి వెళ్ళాడు.

గుంపు మధ్యలో రోడ్డుమీాద వెల్లకిలా పడి వున్నది ఒక స్త్రీ. గుంపును చీల్చుకుంటూ లోపలికి వెళ్ళాడు చిట్టి బాబు.

రోడ్డుమీాద వెల్లికిలా పడివున్న స్త్రీని చూశాడు. వాడి ప్రాణం అవిసిపోయింది.

కళ్ళదగ్గర గుంట - మొహం నిండా మచ్చలు - కుడి చేతిమీాద వాతలు తేలిన గుర్తులు !

"అమ్మా ! !" అని దిక్కులు దద్దరిల్లేలాగ అరచి కళ్ళు తిరిగి పడిపోయాడు చిట్టిబాబు.

వాడి అసలు కథ అప్పుడే మొదలైంది.

అప్పుడు మొదలైన ఆ అసలు కథకి వ్యాఖ్యానం సంఘమూా, వాడి చుట్టూా వున్న మనుష్యులే చెబుతారు గనుక, ఆ ప్రయత్నం నేను విరమించుకుంటున్నాను.

( స మా ప్తం )